ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

ఆదివారం | 26-04- 2026 | సంపుటి: 17, సంచిక: 24, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



## పేద ప్రజల సంక్షేమమే

# ప్రభుత్వ అజెండా

### భద్రత, భరోసా కల్పనపై దృష్టి

**ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు స్వీకరించడం మంచి పరిపాలనకు నిదర్శనం**

**ప్రతి క్లస్టర్‌లో ప్రజా దర్బార్ ద్వారా ప్రజల సమస్యలపై ప్రత్యక్ష అవగాహన**

పాలేరు ఏప్రిల్ 25( ప్రజా కలం న్యూస్ )

ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి న్యాయబద్ధమైన సమస్యను గరిష్టంగా మూడు నెలలలోపు పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి మంత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమానికి భద్రత, భరోసా కల్పించడమే అజెండాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. అభివృద్ధిని ఎక్కడా చిన్న చూపు చూడకుండా పెండింగ్ పనులను పూర్తి చేస్తూ,

తరువాయి 2వ పేజీలో...

# తెలంగాణ రాష్ట్ర సేన

## కొత్త పార్టీ పేరు ప్రకటించిన కల్వకుంట్ల కవిత



### ఉచిత విద్య-వైద్యంతో సంక్షేమ హామీలు
### కేసీఆర్‌పై కవిత ఘాటు విమర్శలు
### రేవంత్ పాలనపై తీవ్ర ఆరోపణలు
### 4 లక్షల ఉద్యోగాల భరోసా
### రైతే రాజు నినాదంతో ముందుకు

**హైదరాబాద్, ఏప్రిల్ 25 (ప్రజాకలం) :**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్ లో కల్వకుంట్ల కవిత పార్టీ ఆవిర్భావ సభ జరిగింది. కవిత కొత్త పార్టీ పేరును ప్రకటించారు. కవిత కొత్త పార్టీ పేరు టీఆర్ఎస్. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... నా జీవితంలో మరిచిపోలేని రోజు అవుతుందని చెప్పారు. తెలంగాణ భవిష్యత్తు రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్నారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జాగృతి కీలక పాత్ర పోషించిందని కవిత గుర్తుచేశారు.

**ఆ కుటుంబంలో భాగమైనందుకు సిగ్గుపడుతున్నా:**

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన ' పేరుతో పార్టీ పేరును ప్రకటించిన కవిత.. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ అధ్యక్షురాలు మాట్లాడుతూ.. తెలంగాణలో కొత్త విప్లవానికి నాంది మొదలైందని అన్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణలో నూతన రాజకీయ శక్తిగా రాబోతున్నామన్నారు. ఇది తన జీవితంలో మర్చిపోలేని రోజని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం అందరి భాగస్వామ్యం అవసరమని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం ఎన్నో కష్టాలు పడి పిడికిలి బిగించి కొట్లాడామని.. ఉద్యమంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. ఉద్యమంలో బతుకమ్మను ఎత్తుకుని ఊరూరా తిరిగానని.. బతుకమ్మ వచ్చిన తర్వాత ఉద్యమానికి ఊపొచ్చిందని కవిత అన్నారు. తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లైనా ప్రజల కలలు నెరవేరలేదని విమర్శించారు. కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ఉద్యమ రథం దారితప్పిందని వ్యాఖ్యానించారు. బానిస సంకెళ్లు పోతాయనుకుంటే పేదలకు దెబ్బలు పడ్డాయన్నారు. తెలంగాణ ఉద్యమంలో జాగృతి కీలకపాత్ర పోషించిందని చెప్పుకొచ్చారు. పదేళ్లు పాలించిన కుటుంబంలో తానూ భాగమైనందుకు సిగ్గుపడుతున్నానంటూ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. దానికి కేవలం క్షమాపణ చెబితే సరిపోద న్నారు. ప్రాయశ్చిత్తం కోసమే ప్రజల ముందుకు టీఆర్ఎస్‌తో వస్తున్నట్లు తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...



## మోదీ, మమత

# దొందూ దొందే

### ఆ ఇద్దరిదీ అధికారం కోసం ఆరాటం, పేదలను పట్టించుకోరు

**దేశ సంపదను ధనికులకు దోచుపెడుతున్నారు : కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ**

హుగ్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇద్దరూ అధికారం కోసం ఆరాటపడుతూ పేదలను పట్టించుకోరని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. దేశ సంపదను ధనికులకు దోచుపెడు తున్నారంటూ విమర్శించారు. హుగ్లీ జిల్లాలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ, మోదీ దేశభక్తుడనని చెప్పుకుంటూ దేశాన్ని అమ్మేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని ఎక్కడకు వెళ్లినా విద్వేషం, భయాన్ని వ్యాపింపజేస్తారని, ఇప్పుడు దేశంలో జరుగుతున్నది రెండు సిద్ధాంతాల మధ్య పోరాటమేనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఐక్యత, సౌభ్రాతృత్వం కోసం పాటుపడుతూ, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల విద్వేషం, హింసకు వ్యతిరేకంగా పోరాడుతోందని చెప్పారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం తనపై అనేక కేసులు పెట్టింద ని, మమతా బెనర్జీపై ఎలాంటి కేసు పెట్టలేదని రాహుల్ అన్నారు. బీజేపీతో మమతాబెనర్జీ నేరుగా పోరాడకపోవడమే అందుకు కారణమని చెప్పారు. తనను వరుసగా 5 రోజుల పాటు ఈడీ ప్రశ్నించిందని,

తరువాయి 2వ పేజీలో...

## ఆర్టీసీ బలోపేతానికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

### మిగిలిన సమస్యలనూ పరిష్కరిస్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, ఏప్రిల్ 25 (ప్రజాకలం) :**

తెలంగాణ ఆర్టీసీని మరింత బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు జరిగిన సమ్మె సమయంలోనే కార్మికులతో పలుమార్లు చర్చలు జరిపామని, వారి ప్రధాన డిమాండ్లను పరిష్కరించామని పేర్కొన్నారు. శనివారం ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు. అధికార ప్రతినిధులు, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులతో మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కార్మికుల చిరకాల స్వప్నమని, దాన్ని తాము నెరవేర్చామని పేర్కొన్నారు.

**మిగిలిన సమస్యలనూ పరిష్కరిస్తాం..**

అలాగే కార్మిక సంఘాల ఎన్నికలు, 11శాతం పీఆర్సీ ప్రకటించడం వంటి అంశాలపై ఆర్టీసీ సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ నిర్ణయాలను చారిత్రాత్మకంగా అభివర్ణిస్తూ కార్మికులు సంబరాలు జరుపుకోవాలని నిర్ణయించారని..

తరువాయి 2వ పేజీలో...

## ఫోన్ ట్యాపింగ్ కేసులో

# కొత్త మలుపు

**- శివకుమార్‌కు నోటీసులు**



**హైదరాబాద్, ఏప్రిల్ 25 (ప్రజాకలం) :**

తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కేసులో సాక్ష్యాధారాల సేకరణలో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం తాజాగా మరో కీలక వ్యక్తికి నోటీసులు జారీ చేసింది. యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్, టీటీడీ మాజీ సభ్యులైన కె. శివకుమార్ ఈ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ విచారణను ఎదుర్కోనున్నారు.

**నోటీసుల జారీ..** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక సమాచారం సేకరించేందుకు శివకుమార్‌కు అధికారులు నోటీసులు పంపారు. మే 28వ తేదీన విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు ఆదేశించారు.

తరువాయి 2వ పేజీలో...

## ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనకు

# ముహూర్తం ఫిక్స్

### అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

**హైదరాబాద్, ఏప్రిల్ 25 (ప్రజాకలం) :**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో వచ్చే నెల 9వ తేదీన పర్యటించ నున్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని తెలుస్తోంది. అలాగే ఇప్పటికే పూర్తయిన కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసే కార్యక్రమాలు కూడా ఉండే అవకాశము ంది. ముఖ్యంగా వీమ్యీగ్రాష్ఘుంవ 2ను జాతికి అంకితం చేసే అంశం ఈ పర్యటనలో ప్రధా నంగా ఉండొచ్చని సమాచారం. హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థను మెరుగుపరిచే ఈ ప్రాజెక్ట్ ప్రజా ప్రయాణానికి కీలకంగా మార నుంది. అలాగే ఎయిమ్స్ బీబీనగర్ ఆస్పత్రిని కూడా జాతికి అంకితం చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రి తెలంగాణతో పాటు సమీప రాష్ట్రాల ప్రజలకు కూడా వైద్యసేవల్లో పెద్ద మార్పు తీసుకురా నుంది. ఇవే కాకుండా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారని సమాచారం. రవాణా, కనెక్టివిటీ రంగాల్లో ఈ ప్రాజెక్టులు కీలకమని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మరో అంశంగా మల్లారెడ్డి యూనివర్సిటీ పర్యటన కూడా ప్రధాని షెడ్యూల్‌లో ఉండొచ్చని చర్చ జరుగుతోంది. ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభాలు, రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ, ఆరోగ్య రంగంలో కొత్త సదుపాయాలపై కేంద్రీకృతమై ఉండే అవకాశాలు ఉన్నాయి.

## ప్రజల సమస్యల పరిష్కారమే

# ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



**ప్రతి గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలి**

**ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు పరిష్కరించడం మంచి పరిపాలనకు నిదర్శనం**

**ప్రజాదర్బార్‌లో సమస్యలు స్వీకరించి త్వరితగతిన పరిష్కారం**

**నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి**

పాలేరు ఏప్రిల్ 25( ప్రజా కలం న్యూస్ )

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్‌లో సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లకు పైగా కాలంగా ప్రజలకు మేలు చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను అధికారులు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. గతంలో ప్రజలు అధికారుల చుట్టూ తిరిగే వారని, ప్రస్తుతం ఇందిరమ్మ పాలనలో అధికారులు ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమే పరిమితమని, అనంతరం ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై పారదర్శకంగా వివరాలు తెలియజేస్తూ పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు.

ప్రజా దర్బార్ లో వచ్చిన ఫిర్యాదు లను వారం, నెల, మూడు నెలల వ్యవధిలో పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించి చర్యలు తీసుకుంటా మని మంత్రి తెలిపారు. ఏప్రిల్ 27 నుంచి ప్రతి ఉమ్మడి జిల్లా పరిధి లో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి రెవెన్యూ, హౌజింగ్ శాఖల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

# తెలంగాణ రాష్ట్ర సేన

మొదటి పేజీ తరువాయి...
తెలంగాణ ఆత్మను బీఆర్ఎస్ కోల్పోయిందన్నారు. తెలంగాణ ప్రజలకు ఒక అమ్మగా ఉండాలనుకుం టున్నానని అన్నారు. సామాజిక తెలంగాణ సాధన కోసం పనిచేస్తానని కవిత స్పష్టం చేశారు. బీజేపీకి తెలంగాణ ఏర్పాటు ఇష్టం లేదని కవిత విమర్శించారు. తెలంగాణ విభజనను పాకిస్థాన్‌తో పోల్చారని మండిపడ్డారు. రాష్ట్ర బీజేపీ ఎంపీలు కేంద్రానికి బానిసలంటూ దుయ్యబట్టారు. ఏపీలో కలిపిన ఐదు గ్రామాలను తెలంగాణకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. సామాజిక తెలంగాణను కేసీఆర్ సాధించలేకపోయారని విమర్శించారు. అప్పటి టీఆర్ఎస్‌కు తన రక్తాన్ని ధారపోశానని చెప్పుకొచ్చారు. కేసీఆర్ మర మనిషి.. మన మనిషి కాదని వ్యాఖ్యానించారు. ప్రజలకు కష్టం వస్తే కేసీఆర్ రారని అన్నారు. పేదల ఇళ్లు కూలుతుంటే కేసీఆర్ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. 'నాకు తండ్రి కావొచ్చు.. కానీ కేసీఆర్ రాజకీయ పరిణతి కోల్పోయారు' అంటూ కవిత తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**కేసీఆర్‌పై హాట్ కామెంట్స్ చేసిన కవిత..**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత, తన తండ్రి కేసీఆర్‌పై కవిత ఘాటు విమర్శలు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ..'ఫాంహౌస్ వీడి కేసీఆర్ బయటకు రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నా. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయారు. ప్రజల కోసం కొట్లాడాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎక్కడ?. అధికారం వచ్చాక ఆయన మరకారం కోల్పోయారు. మారిన మరబొమ్మ కేసీఆర్. మాటల మనిషి, మర మనిషి, మారిన మనిషి కేసీఆర్. ఎక్కడ కష్టం వచ్చినా ఆ సారు రారు. గుంట నక్కల, తోడేళ్ల చేతిలో బందీ అయిన మనిషి. అదే మన కేసీఆర్ అయితే పాలమూరు దగ్గర కుర్చీ వేసుకుని మరీ పనులు పూర్తి చేసేవారు. తెలంగాణ వదిలిపెట్టి కేసీఆర్ ఇతర రాష్ట్రాలు తిరి గారు. నేను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకపోతే ప్రజలే బయటకు లాగి సమాధానం చెప్పిస్తారు. కేసీఆర్ మారతారేమో అని చూశా. ఇళ్లు, భూములు అమ్ముకుని రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను ఏం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల మీద కర్రలతో దాడులు చేసిన వారికి పదవులు ఇచ్చారు. ఉద్యమకారులకి మర్యాద ఇచ్చారా?. కేసీఆర్ మారిపోయారు కాబట్టే నేను యుద్ధం చేస్తున్నా. మనకు ప్రాణాలు అడ్డంపెట్టి పోరాడే సైన్యం కావాలి. నేను ఏం తప్పు చేశానని నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాళేశ్వరం మీద మాట్లాడితే సస్పెండ్ చేస్తారా?. అవినీతి చేసిన పందికొక్కులని కేసీఆర్ పక్కన పెట్టుకున్నారు. ఎదురుగా నిలబడి కొట్లాడతా.. నాతో కలిసి పోరాడుతారా?. ఇప్పుడు మనమే ప్రతిపక్షం. రెండేళ్ల తర్వాత అధికారంలోకి వస్తాం. మూడు పార్టీలు అవినీతి, బంధుప్రీతి, అధర్మంతో నిండిపోయాయి' అని అన్నారు.

**పాంచజన్యం పేరుతో హామీలను ప్రకటించిన కవిత**

తెలంగాణ రాష్ట్ర సేన పేరుతో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించిన కవిత.. ప్రజలకు పలు కీలక హామీలు ఇచ్చారు. మునీరాబాద్ సభలో కవిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం తాను ఐదు ప్రధాన అంశాలపై ప్రత్యేకంగా కృషి చేస్తానని కవిత ప్రకటించారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక న్యాయం లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. మరో రెండేళ్ల తర్వాత 'మీ అమ్మ ప్రభుత్వం' కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మంచి పాలన అందిస్తామని కవిత హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష పాత్రను సమర్థంగా పోషిస్తామని తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న మూడు ప్రధాన పార్టీలు.. అవినీతి, కుటుంబ పాలన, అధర్మంతో నిండిపోయాయని తీవ్ర విమర్శలు గుప్పించారు. 'నేను మీ అమ్మను.. తల్లి జేబు చూడదు, కడుపు చూస్తుంది' అంటూ వ్యాఖ్యానించారు. దళితబంధు పథకంపై స్పందించిన కవిత.. ఒక్క ఉపఎన్నిక కోసమే దళితబంధు అమలు చేశారని ఆరోపణలు గుప్పించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక ప్రతి అమరవీరుడి కుటుంబానికి కోటి రూపాయలు సాయం అందిస్తామన్నారు. ఆడబిడ్డల భద్రతపై ప్రధాన అంశంగా పనిచేస్తామని కవిత స్పష్టం చేశారు.

# మోదీ, మమత దొందూ దొందే

మొదటి పేజీ తరువాయి...
మమతా బెనర్జీపై మాత్రం ఈడీ, సీబీఐ దర్యాప్తులు లేవని అన్నారు. కేవలం కాంగ్రెస్ మాత్రమే బీజేపీపై సైద్ధాంతిక పోరాటం చేస్తోందని, ఆ కారణంగానే తనపైన, పార్టీ అధ్యక్షుడు ఖర్గేపైన 24 గంటలూ మోదీ దాడులు చేస్తుంటారని విమర్శించారు.

**ఎన్నికలప్పుడే..**

ఎన్నికలు వచ్చినప్పుడే టీఎంసీపై ప్రధానమంత్రి విమర్శలు చేస్తుంటారని, బెంగాల్ ఎన్నికలు పూర్తయితే మమతాబెనర్జీని మోదీ ఒక్కమాట కూడా అనిరని రాహుల్ చెప్పారు. బీజేపీ–ఆర్ఎస్ఎస్‌ను ఓడించగలిగేది కాంగ్రెస్ మాత్రమేనని, ఆ విషయం మోదీకి తెలుసుని అన్నారు. పశ్చిమబెంగాల్‌లో పరిశ్రమల నాశనానికి, యువత నిరుద్యోగులుగా మిగిలిపోవడానికి టీఎంసీ సుప్రీం కారణమని విమర్శంచారు. పార్టీ కార్యకర్తలు, గూండాల ప్రయోజనాల కోసమే ముఖ్యమంత్రి పనిచేస్తుంటారని, టీఎంసీ హయాంలో కోట్లాది రూపాయల శారద స్కామ్, రోజ్ వ్యాలీ పాంజీ స్కామ్‌లు చోటుచేసుకున్నాయని చెప్పారు. బెంగాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలపై టీఎంసీ అకృత్యాలు జరుపుతుంటే, దేశంలోని ఇతర ప్రాంతాల కాంగ్రెస్ కార్యకర్తలపె బీజేపీ అకృత్యాలు చేస్తోందన్నారు. మమతాబెనర్జీ వల్లే బెంగాల్‌లో బీజేపీ అడుగుపెట్టిందని, ప్రజల కోసం టీఎంసీ పనిచేసి ఉంటే బీజేపీ రాష్ట్రంలో అడుగుపెట్టే అవకాశమే ఉండేది కాదన్నారు.

# ఆర్టీసీ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మొదటి పేజీ తరువాయి...
ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ కేడర్ కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రుల బృందం సుమారు 15 గంటలపాటు కార్మికులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు. ఇంకా మిగిలిన సమస్యలనూ కూడా దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేసినా, వారి డిమాండ్లు నెరవేర్చలేదని విమర్శించారు.

**మా ప్రభుత్వానికి కార్మికులతో విభేదాలు లేవు..**

ఆ సమయంలో 30 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి కార్మికులతో విభేదాలు లేవని, వారిని కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నామని చెప్పారు. సమ్మె సమయంలో ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ శవ రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరించిన తీరు సరికాదని అభిప్రాయపడ్డారు. 2013 బాండ్లు, 2017 పీఆర్సీ, డీఏలు, సీసీఎస్, పీఎఫ్ బకాయిల చెల్లింపులు, కొత్త బస్సుల కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, కారుణ్య నియామకాలు వంటి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే సర్వీసు నుంచి తొలగించిన కార్మికులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్నామని ప్రస్తావించారు. ప్రస్తుతం రోజుకు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్నారని తెలిపారు. పేదలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం ఆర్టీసీ ఒక లైఫ్ లైన్‌లా పనిచేస్తోందని మంత్రి పొన్న ప్రభాకర్ పేర్కొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ అజెండా

మొదటి పేజీ తరువాయి...
గత ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాలను కొనసాగిస్తూ ఎన్నికల హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పేద ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ల లోనే అధికారులను ప్రజల వద్దకు పంపి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించి సంక్షేమ కార్యక్రమాలు అందించామని మంత్రి తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి వారం ఒక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు మేలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రతి క్లస్టర్ పరిధిలోనీ గ్రామ పంచాయతీలలో ప్రజా దర్బార్ నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును గరిష్ఠంగా మూడు నెలల్లో పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నేలకొండపల్లి మండలంలో వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు 55 శాతం ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చినవేనని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, నిర్మాణ పురోగతి ఆధారంగా నిధులు విడుదల చేయడంతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. మే నెలలో రెండవ విడత, తదుపరి విడతల్లో కూడా అర్హులైన పేదలకు ఇండ్లు అందిస్తామని తెలిపారు. ధరణి కారణంగా ఏర్పడిన భూ సమస్యలను భూభారతి ద్వారా పరిష్కరించే ప్రయత్నం జరుగు తోందని, సాదా బైనమా దరఖాస్తులను పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. ఆసరా పెన్షన్, రేషన్ కార్డులు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్రమపద్ధతిలో పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలు తొందరపడకుండా ప్రశాంతంగా దరఖాస్తులు సమర్పించాలని, ప్రతి ఒక్కరి దరఖాస్తును స్వీకరించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. సుబ్లేడు గ్రామానికి నూతన పోలీస్ స్టేషన్ మంజూరుకు ప్రభుత్వ అనుమతి తీసుకొని త్వరలోనే శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ముఖ్యమైన కార్యక్రమమని తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల వద్దకే వచ్చి సమస్యలు స్వీకరిస్తున్నారని చెప్పారు. కొన్ని సమస్యలు వెంటనే, మరి కొన్ని కొంత సమయం తీసుకున్నప్పటికీ ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ, ఉదయం నేలకొండపల్లి మండలంలో ప్రజా దర్బార్ విజయవంతంగా నిర్వహించామని, ప్రస్తుతం తిరుమలాయపాలెం మండలంలో కొనసాగుతోందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం మంచి పరిపాలనకు సూచిక అని పేర్కొన్నారు. ప్రతి అర్జీపై ఫాలోఅప్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్, మండల ప్రత్యేక అధికారి, వివిధ శాఖల ఉన్నతాధికారుకు, జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్, ఎంపీడీఓ, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులకు భారీ దెబ్బ..

## పోలీసుల ఎదుట లొంగిపోయిన 47 మంది మావోయిస్టులు



హైదరాబాద్, ఏప్రిల్ 25: తెలంగాణలో మావోయిస్టు ఉద్యమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 47 మంది అజ్ఞాత మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరారు. లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, అలాగే దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన కీలక నేతలు ఉన్నారు. ముఖ్యంగా హేమ్లా ఇతు (అలియాస్ విజ్జా), పోడియం లచ్చు (అలియాస్ మనోజ్) వంటి నాయకులు ఈ జాబితాలో ఉన్నారని డీజీపీ తెలిపారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలు కూడా అప్పగించారు. మొత్తం 32 ఆయుధాలు, అలాగే 515 తూటాలు పోలీసులకు సమర్పించినట్లు డీజీపీ వెల్లడించారు. వీటిలో LMG, AK-47, INSAS, SLR రైఫిల్స్‌తో పాటు పిస్టల్స్, రివాల్వర్, మస్కెట్ గన్స్ వంటి వివిధ రకాల ఆయుధాలు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానం కారణంగా ఈ మావోయిస్టు కేడర్లు లొంగుబాటుకు ముందుకొచ్చారని చెప్పారు. దక్షిణ బస్తర్ డివిజన్ ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్య స్థితికి చేరిందని కూడా డీజీపీ వ్యాఖ్యానించారు. లొంగిపోయిన వారిలో PLGA బెటాలియన్‌కు చెందిన 4 మంది, ఐఖ్గూజకు చెందిన 28 మంది, అలాగే 9వ, 30వ ప్లాటూన్‌లకు చెందిన 15 మంది ఉన్నారని వివరించారు.

**డీజీపీ విజ్ఞప్తి..** ఇక తెలంగాణకు చెందిన కొంతమంది కీలక మావోయిస్టు నాయకులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. వారిలో లక్ష్మణరావు (గణపతి), పసునూరి నరహరి (సంతోషం), జాడి రత్నాభాయ్ (సుజాత), వార్త శేఖర్ (మంగు) ఉన్నారని పేర్కొన్నారు. వీరిని కూడా లొంగిపోవాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు ఉద్యమంపై తెలంగాణలో భద్రతా బలగాల చర్యలు మరింత ప్రభావం చూపుతున్నాయని డీజీపీ తెలిపారు. జనజీవన స్రవంతిలో చేరి తెలంగాణ ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ద్వారా లభించే అన్ని ప్రయోజనాలను పొందాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసుల సమర్థవంతమైన పనితీరు వల్ల మొత్తం 818 మంది మావోయిస్టులు లొంగిపోగా, వారి నుంచి 334 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న మెరుగైన పునరావాస ప్యాకేజీలు, పోలీసులు సాగిస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల అడవి బాట పట్టిన వారు తిరిగి ఇంటికి చేరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ఈ భారీ లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావం మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో

# కొత్త మలుపు

మొదటి పేజీ తరువాయి...
బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ విచారణ జరగనుందని సిట్ అధికారులు తెలిపారు.

**ఈ కేసు నేపథ్యమిదే..**

కేసీఆర్ హయాంలో రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీల ఫోన్లను ట్యాపింగ్ చేశారనే ఆరోపణలపై ఈ దర్యాప్తు జరుగుతోంది. ఇప్పటికే పలువురు పోలీసు ఉన్నతాధికారులు అరెస్ట్ కాగా, తాజాగా సాక్షుల విచారణలో భాగంగా శివకుమార్‌ను పిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ట్యాపింగ్ బాధితుల్లో శివకుమార్ పేరు ఉందా..? లేదా..? దీనికి సంబంధించిన ఇతర వివరాలు ఏమైనా ఆయనకు తెలుసా..? అనే కోణంలో అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంది. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను వేదికగా చేసుకుని జరుగుతున్న ఈ విచారణ, ఈ కేసును మరింత సమగ్ర సమాచారాన్ని ఛేదించే దిశగా ఈ విచారణ సాగనున్నట్లు తెలుస్తోంది. మే 28వ తేదీన శివకుమార్ ఇచ్చే స్టేట్‌మెంట్ ఈ కేసులో ఎవరి పాత్రను బయటపెడుతుందో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## ప్రజల సమస్యల పరిష్కారమే

# ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...
వేసవి కాలంలో త్రాగునీరు, విద్యుత్ సమస్యల నివారణకు చర్యలు తీసుకున్నామని, ప్రతి గ్రామంలోని సమస్యలనుపరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. న్యాయమైన ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని మంత్రి భరోసా ఇచ్చారు. ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, మంత్రివర్యులు, వివిధ శాఖల అధికారులు ఒకే వేదికపై ప్రజల ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారంపై చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ, ప్రజలకు భరోసా కల్పించే విధంగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను గ్రామ వారీగా గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించడం మంచి పరిపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.
రాయిగూడెం, అజయ్‌తండా, చెరువు మాదారం, మంగాపురం తండా, అప్పల నరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలతో మంత్రి ముఖాముఖి భేటీ అయ్యారు. ప్రజాదర్బార్ లో సమస్యలువింటూ అర్జీలు స్వీకరించారు.
అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరికి తీసుకెళ్తున్నామని తెలిపారు. మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, క్లస్టర్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని చెప్పారు. క్లస్టర్ సమావేశాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను అదే చోట పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు, భూ సమస్యలు, పెండింగ్ పెన్షన్లు, తదితర అంశాలను గుర్తించి పరిష్కరిస్తున్నామని తెలిపారు.
ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వ ధ్యేయమని, గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఇళ్లులు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం తొలి దశలో 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని, త్వరలో మరొక దశ ఇళ్లు మంజూరు చేయనున్నామని పేర్కొన్నారు. భూభారతి ద్వారా అనేక భూ సమస్యలు పరిష్కరించా మని, మిగిలిన సాదాబైనామా సమస్యలను కూడా పరిష్కరిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వి. సీతారాములు, మండల ప్రత్యేక అధికారి, వివిధ శాఖల ఉన్నతాధికారుకు, జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలను...

# కవిత తప్పుదోవ పట్టిస్తున్నారు

హైదరాబాద్, ఏప్రిల్ 25 : కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై కాంగ్రెస్ భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పెట్టినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. అమ్మగా జేబులు చూసి కాదని.. కడుపు చూసి పాలిస్తానని కవిత చెప్పారని ప్రస్తావించారు. శనివారం హైదరాబాద్ వేదికగా కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు జేబులు చూసి పరిపాలించారని కవిత చెప్పారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గతంలో టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కవిత బయటకు వచ్చి పార్టీ పెట్టి ఉంటే ప్రజల్లో మంచి ఆదరణ వచ్చేదని చెప్పుకొచ్చారు.

**కేసీఆర్ హయాంలో దోపిడీ చేశారు..**

నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణను కేసీఆర్ హయాంలో దోపిడీ చేశారని ఎంపీ చామల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు కవిత ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పంచుకునే వాటాల్లో తేడాలు వచ్చి ఆమె బయటకు వచ్చారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని అన్నారు. కవిత ఇప్పుడు బయటకు వచ్చి సీఎం, సీఎం అని నినాదాలు చేయించుకుంటు న్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కర్కోటకుడు, హిట్లర్ అంటే కవితకు మార్కులు పడవని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ, ఫ్యూచర్ సిటీ, ఉద్యోగాలు, మూసీ ప్రక్షాళన చేస్తున్నందుకు కర్కోటకుడు అయ్యారా...? అని ఫైర్ అయ్యారు.



**కవిత.. నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తే స్వాగతిస్తాం..**

కవిత పార్టీ పెట్టుకోవచ్చని, పోరాటం చేయొచ్చని, ప్రజల్లోకి వెళ్లవచ్చని తెలిపారు. తెలంగాణను దోచుకోవడానికే ఆమె సీఎం కావాలని అంటున్నారా..? అని నిలదీశారు. కవిత నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. ఆమె తెల్లకాగితం కాదని.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంపీగా, ఎమ్మెల్సీగా ఆమె పని చేశారని ప్రస్తావించారు. తెలంగాణ ప్రజలను కవిత తప్పుదోవ పట్టిస్తున్నారని.. తెలంగాణ ప్రజలు ఆమెను నమ్మరని కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

## - దేగాం లో మహిళ సమైక్యభవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే
## - రాష్ట్రములోనే మొదటి సారిగా భవన నిర్మాణమై ప్రారంభం
## - సర్పంచ్ సుష్మరెడ్డి పని తీరు పట్ల అభినందన

నిర్మల్ ఏప్రిల్ 25 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. శనివారం భైంసా మండలం లోని దేగాం గ్రామం లో 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన గ్రామ మహిళ సంఘభవనాన్ని ప్రారంభించిన సందర్భంగా అయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వ వాటా 10 శాతం నిధుల తో సంఘ భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. భైంసా మండలానికి 40 కి పైగా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్టంలో నే మొదటి సారిగా భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించినందుకు సర్పంచ్ సుష్మరెడ్డి, అధికారుల పని తీరును అయన అభినందించారు.. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలు విన్నవించడం తో దశల వారిగా గ్రామ అభివృద్ధి కి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. సిరాల ప్రాజెక్ట్ ద్వారా దేగాం ఆయకట్టుకు సాగునీరు అందించాలని కోరగా, కొన్ని చోట్ల మచ్కల్ సమీపంలో కాలువను తవ్వేశారని 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించి కాలువ ను పూర్తి స్థాయి లో నిర్మించి సాగునీటిని అందిస్తామన్నారు... అభివృద్ధే ధ్యేయం గా తాను ముందుకు సాగుతున్నాని, 28 ప్యాకేజి



పూర్తి అయితే నియోజకవర్గం సస్యశామలం అవుతుందన్నారు. అదే విధంగా భూగర్భజాలలను పెంచేందుకు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని డి. ఆర్. డి. ఎ. పి డి. విజయలక్ష్మి సూచించారు. అనంతరం సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి మాట్లాడుతూ తాను ఒక సామాన్య మహిళ నుండి సర్పంచ్ గా కావడం లో గ్రామస్తుల ఎమ్మెల్యే సహకారం ఎంతో ఉందన్నారు.. గ్రామ అభివృద్ధి కి దశల వారిగా నిధులు ఇస్తున్న ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు చెప్పారు.. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే కు గ్రామస్తులు, మహిళా సంఘ సభ్యులు స్వాగతించి శాలువ తో సత్కరించారు.. కార్యక్రమం లో అధికారులు, నాయకులు, ఆయా గ్రామల సర్పంచ్ లు పాల్గొన్నారు.

# అనవసర వివాదాలు




హైదరాబాద్, : మనదేశంలో ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా ఉన్నాయి. వీటన్నింటికీ లేని గొప్ప నేపథ్యం తెలంగాణ రాష్ట్రానికి ఉంది. ఎందుకంటే మిగతా రాష్ట్రాలు ఎటువంటి ఉద్యమ నేపథ్యం లేకుండా ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం మాత్రం ఉద్యమాలు చేస్తే.. ప్రాణాలను తృణప్రాయంగా వదిలేస్తే వచ్చింది. ఆందోళనలు, నిరవధిక నిరాహార దీక్షలు, మిలియన్ మార్చ్ లు, వంటా వార్పు లు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చేస్తేనే తెలంగాణ సాకారమైంది.స్వీయ అస్తిత్వ కాంక్ష అనేది తెలంగాణ మట్టిలోనే ఉంది. అందుకే ఇక్కడ రాజకీయ చైతన్యం.. సామాజిక చైతన్యం.. ప్రజలలో ధిక్కారస్వభావం అధికంగా ఉంటాయి.. కాళోజి నారాయణరావు.. జయశంకర్.. పోటు కృష్ణమూర్తి.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది ఉద్యమకారుల వారసత్వం తెలంగాణ లో ప్రతి ప్రాంతంలో కనిపిస్తూనే ఉంటుంది. తెలంగాణ ఉద్యమం ఏర్పడేందుకు ప్రధాన కారణం ఆంధ్ర పాలకుల దోపిడి.. వివక్ష.. వీటినుంచి తెలంగాణ తనను తాను కాపాడుకొనేందుకు అనేక రకాలుగా ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. ప్రాణాలు కూడా కోల్పోవాల్సి వచ్చింది. చివరికి తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇటువంటి వాతావరణం మళ్లీ కనిపిస్తుంటే ఇంతకంటే దారుణం మరొకటి ఏమి ఉంటుంది.నాడు తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్నప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాకను తీవ్రంగా నిరసిస్తూ మహబూబాబాద్ లో తెలంగాణ ఉద్యమకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. కానీ అటువంటి జగన్మోహన్ రెడ్డిని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్ కు తోడుకొని వచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి కెసిఆర్ హాజరయ్యారు. అప్పట్లో చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ పేరుతో జగన్మోహన్ రెడ్డికి కెసిఆర్ సహాయం చేసినట్టు వార్తలు వచ్చాయి. అంతేకాదు రాయలసీమ ను బంగారు తునక చేస్తానని.. తెలంగాణ నుంచి ఎంత నీటినైనా సరే ఇస్తానని కేసీఆర్ ప్రకటించారు.. అంతేకాదు పోతిరెడ్డిపాడు వెడల్పుకు సహకరించారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ జమానాలో ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా చాలా జరిగాయి.. నాడు జాతీయ పార్టీ ఊహల్లో తేలియాడుతూ.. దేశానికి ప్రధానమంత్రి కావాలని ఆరాటంలో కేసీఆర్ చాలా చేశారు. చివరికి తనే కామారెడ్డిలో ఓడిపోయారు.ఇప్పుడు ఇదే కేసీఆర్ సరికొత్త పల్లవి అందుకున్నారు.. నాడు తెలంగాణ ఉద్యమంలో తాను కరీంనగర్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తే.. తన మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చేర్చుకున్నారు. ఆయనకు ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు. అంతేకాదు ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొన్నారు. నాడు ఇదే ఎన్నికల్లో తనకు వైయస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే ముఖ్యమని.. తెలంగాణ ఉద్యమంతో ఏం సంబంధం అని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పుడు తరచూ చంద్రబాబును.. రేవంత్ రెడ్డిని ఇష్టానుసారంగా తిట్టే కేసీఆర్.. నాడు తన మీద వ్యతిరేకంగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారనేది ఇక్కడ గమనించదగ్గ విషయం.రేవంత్ రెడ్డిని తెలంగాణ ఉద్యమకారుల మీదికి రైఫిల్ తీసుకుని వెళ్ళాడు.. ఉద్యమకారులను తిట్టాడు.. ఆంధ్ర పార్టీలో పని చేశాడు.. అంటూ విమర్శిస్తున్న గులాబీ పార్టీ నేతలు.. జీవన్ రెడ్డి రాకను ఏ విధంగా సమర్థించుకుంటారో చెప్పాల్సి ఉంది.ఇక రేవంత్ రెడ్డి విషయానికి వస్తే.. నాడు ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు సముచిత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు అతిగతి లేదు. తెలంగాణ రాష్ట్రానికి ఉద్యమ గేయాన్ని రాష్ట్ర గేయంగా మార్చినప్పటికీ.. ఇంకా చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. నాడు జీవన్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా పోటీలో ఉన్నప్పుడు ప్రచారం చేసింది రేవంత్ రెడ్డి. ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొంది కూడా రేవంత్ రెడ్డినే. ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి జీవన్ రెడ్డిని విమర్శించారు. జీవన్ టోన్ అంటూ మండిపడ్డారు. అంతేకాదు జగిత్యాల నియోజకవర్గం లో భారత రాష్ట్ర సమితి గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ ను గొప్ప నాయకుడిగా అభివర్ణిస్తున్నారు..

## లేబర్ కోడ్స్ రద్దుకై పోరాటాన్ని
# ఉధృతం చేయండి



నిర్మల్ ఏప్రిల్ 25 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

చికాగో అమరవీరుల, మే డే స్ఫూర్తి తో కార్మికులకు నష్టం చేసే లేబర్ కొడ్స్ రద్దుకై పోరాడుదాం అని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టి యు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. హరిత పిలుపునిచ్చారు. శనివారం భైంసా మండలం వనాల్పాడ్ లో మే డే పోస్టర్ విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐరాపాలో జరిగిన పారిశ్రామిక విప్లవం నుండి ఆధునిక కార్మిక వర్గం ఉద్భవించిందని కొత్త యాంత్రికరణ విష్కరణలతో పోటీ పడలేక పనిగంటలను తగ్గించాలని కార్మిక వర్గం పోరాడిందని మే ఒకటి 1886న అమెరికాలోని చికాగో లో 8 గంటల పని దినాన్ని డిమాండ్ చేస్తూ కార్మికులు నిరసనలు, ఆందోళనలు చేపట్టారని, పెట్టుబడిదారి వర్గం ఈ శాంతియుత ప్రదర్శనలపై కాల్పులు జరిపిందని, కార్మికులు తూటాలకు బలయ్యారని తిరుగుబాటు నాయకులను ఉరితీసారని కేసులు పెట్టి తీవ్ర అణిచివేతకు పాల్పడి జైలు శిక్షలు విధించారనీ, ఈ కార్మికుల బలిదానాల రక్త దర్పణులతో మే డే చరిత్ర లో నిలిచిపోయిందని అన్నారు.కార్పొరేట్ పెట్టుబడి దారులకు కార్మికుల రక్తాన్ని ధరబోసే చట్టాలను కేంద్రం చేస్తూ, కార్మికులను బానిసలుగా మారుస్తున్నదని, లేబర్ కోడ్స్ రద్దుకై పోరాటాన్ని ఉధృతం చేయండి అనే పిలుపుతో 140 వ మే డే విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాజేశ్వర్, నరేందర్, భారతి, లక్ష్మి శ్యామల, వనిత తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి
# చిత్రపటాలకు పాలాభిషేకం

నిర్మల్ ఏప్రిల్ 25 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఆర్టీసీ కార్మికుల చిరకాల కోరిక సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఆర్టీసీ జే ఏ సి, యాజమాన్యం,ప్రభుత్వం తో జరిగిన చర్చలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 32 డిమాండ్ ల తో పాటు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించడంతో నిర్మల్ డిపోలో ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ల చిత్ర పతాలకు పాలాభిషేకం చేశారు.టపాసులు పేల్చి మిఠాయిలు పంచారు. ఎన్నికల్లో ఆర్టీసీ వారికి ఇచ్చిన హామీలు తీర్చిన ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వంలో విలీనం ప్రక్రియ తొందరగా చేపట్టాలని, చర్చల్లో ఒప్పందాలన్ని సకాలములో చెల్లించాలని ఉద్యోగులు అభిప్రాయ పడ్డారు.కార్యక్రమంలో జే ఏ సి.రీజినల్ నాయకులు ఆర్.గంగాధర్, కే.రమేష్, రాజేశ్వర్ ఉద్యోగులు పాల్గొన్నారు.







ప్రజా కలం
ఆదివారం, ఏప్రిల్ 26, 2026

# చీతా గమనం





మధ్యప్రదేశ్ లోని కునో నేషనల్ పార్కు పక్షుల కిలకిల రావాలతో కునో నిద్ర మేలుకుంటుంది. గడ్డిమీద ముత్యాల్లా మెరుస్తున్న మంచు బిందువులు, తొలి కిరణం తాకగానే బంగారు వెలుగులో కరిగిపోతున్నాయి. కునో నది దగ్గర మబ్బులా తేలికపాటి పొగమంచు నీటి మీద తేలుతూ ఉంది. నీరు నిశ్శబ్దంగా ప్రవహిస్తుంటే, దాని పక్కనే జింకలు జాగ్రత్తగా అడుగులు వేస్తూ నీళ్లు తాగడానికి వస్తున్నాయి. ప్రతి కదలికలో అప్రమత్తత. ప్రతి శబ్దంలో ఒక కథ దాగి ఉంటుంది. పక్కనే గడ్డి పొదల్లో ఒక చలనం. గాలి వల్ల కదలిక కాదది. వేట కోసం నిశ్శబ్దంగా కదులుతున్న చీతా. అదే KP-2. తల్లి రక్షణ నుండి బయటపడి తన ఆహారాన్ని తనే సంపాదించుకోవడానికి బయల్దేరిన యువ చీతా. చిరుతలకు మాత్రమే సాధ్యమైన నిశ్శబ్ధాన్ని వంటబట్టించుకుని మెల్లగా అడుగులో అడుగు వేస్తోంది.

KP-2 సాధారణ చీతా కాదు. ఇది Asha అనే చీతా సంతానం. 'ప్రాజెక్ట్ చీతా' లో భాగంగా ఆఫ్రికాలోని నమీబియా నుండి భారత్‌కు ప్రత్యేక విమానంలో తీసుకుని వచ్చిన 'The Asha' మగ సంతానమే ఈ KP-2. బుల్లి కూనగా ఉన్నపుడు 'ఆశ' అమ్మతో కలిసి తిరుగుతూ కునో అందాలను, అక్కడి జీవితాన్నీ చూసాడు. ఆ ప్రయాణంలో వేటాడడం కూడా నేర్పింది ఆశ. కొన్నాళ్ళకి వేటలో అమ్మను మించిన కొడుకు అయ్యాడు. కానీ అతని మనసు అస్థిరంగా ఉంది. ఇంకా ఏదో కావాలి. సహజంగా చీతాలకు విశాలమైన అడవులను తమ సొంత ప్రాంతంగా ఎన్నుకుని ఆ పరిధిలో వేటాడడం అలవాటు. KP-2 పెద్దవాడు అయ్యే కొద్దీ కునో అడవి వేటకు ఇరుకుగా అనిపించింది. సొంత టెర్రిటరీ నిర్మించుకోవాలి అనుకున్నాడు. తనదైన విశాల సామ్రాజ్యం కావాలి. ఆ సామ్రాజ్యానికి తనో రాజునవ్వాలి. ఆ ఆత్రం అతన్ని అడవి లోపల ఆగిపోనివ్వలేదు. ఆ రోజు రాగానే తను పుట్టి పెరిగిన కునో అడవిని వదిలి నిశ్శబ్ధంగా అడుగు ముందుకేశాడు. వెళ్తూ వెళ్తూ చివరిసారి కునో అడవిని చూశాడు. అడుగులు భారంగా పడుతున్నాయి. మొదట్లో చిన్నగా మొదలైన ప్రయాణం కొంచెం దూరం, ఇంకొంచెం దూరం అంటూ మైళ్ల దూరం నడుస్తూనే ఉన్నాడు. శివపురం అనే గ్రామం సరిహద్దుకు చేరే సరికి దాహంతో పాటు ఆకలి ఇబ్బందిగా ఉంది. పుట్టినప్పటి నుండి కునో దాటి బయట ప్రపంచం చూడడం వాడికి ఈ మైదాన ప్రాంతమంతా కొత్తగా ఉంది. ఏపుగా పెరిగిన గోధుమ పంట పొలాల వెంబడి నడుస్తూ, నీటి కాలువ ఆచూకీ కోసం తిరుగుతూ, నీరు కనిపిస్తే దాహం తీర్చుకుంటూ ముందుకు సాగుతూ సుదీర్ఘమైన ప్రయాణం చేస్తున్నాడు. నాలుగు రోజులయ్యేసరికి శరీరంలో సత్తువ తగ్గుతున్నట్టుగా అర్థమైంది. నడక వేగం తగ్గింది, అలసి పోతున్నాడు. మైదాన ప్రాంత జీవనం వల్ల రాత్రి తప్ప పగలు నడక సాగించే పరిస్థితులు కనిపించడం లేదు వాడికి. రంగు రంగుల చీరలు కట్టుకున్న ఆడవారు పాటలు పాడుతూ, పొలాల్లో పనులు చేసుకుంటూ కనిపిస్తున్నారు. మనిషి అలికిడైన ప్రతిసారి ఏదో ఒక చెట్టు పొద చూసుకుని అక్కడే నక్కి ఉంటున్నాడు.'ఈ విశాల భూ ప్రపంచంలో ఎవరికైనా ఎదురు వెళ్లి నిలబడి పోరాడగలవు కానీ మనుషుల కంట పడకు నాన్నా. మనిషిని మాత్రం నమ్మకు' అని అమ్మ నేర్పిన జీవిత పాఠం గుర్తుంది.ఆ రోజు రాత్రి ఊరి చివరి ఇల్లు, పశువుల పాక కనిపించగానే అటు వైపుగా పడ్డాయి అడుగులు. ఈ రాత్రి కూడా ఆహారం దొరకలేదంటే కాలే కడుపుతో, సత్తువ లేని శరీరం ఇక్కడే కూలిపోబోతుందని అర్థం అవుతోంది దానికి. పాకలోని ఆవులకు, ఎద్దులకు మేత వేసి ఇంట్లోకి వెళ్ళిపోయాడు ఇంటి యజమాని. ఆ పాక వెనుక ఉన్న పొదల్లో నక్కి, ఇదంతా గమనిస్తున్నాడు KP-2. అదను కోసం ఆశగా ఆబగా మాటు వేసి ఉన్నాడు. వాడి కళ్ళు చీకట్లో నక్షత్రాల్లా మెరుస్తున్నాయి.

యజమాని లోనికి వెళ్ళగానే చిన్నగా, ఆకుల శబ్దం కూడా రాకుండా మెల్లగా కదులుతూ పాక వైపుగా వెళ్ళాడు. అక్కడొక ఆవు చిన్న దూడ ఉన్నాయి. వాడి కళ్ళు ఆ దూడ వైపు ఆబగా చూస్తున్నాయి. ఆ పక్కనే ఇంకొంచెం పెద్దగా కనిపిస్తున్న దూడ ఉంది. రెండు ఎడ్లు ఇంకో పక్కన కట్టేసి ఉన్నాయి.

KP-2 ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఒక్క ఉదుటున ఆ రెండవ దూడ మీదకు దుంకాడు. ఊహించని ఈ దాడికి బెదిరిన పశువులు అంబ అంబా అంటూ ఒకదాన్ని చూసి మరొకటి బెదరసాగాయి. ప్రాణ భయంతో కట్టేసిన తాళ్లు విదిలించుకోవాలని, మోరలు విదిలిస్తూ అటు ఇటు గింజుకుంటున్నాయి. ఆవు ఎక్కడ తన దూడ మీదకు వస్తుందోనని తన బుజ్జి దూడని పూర్తిగా కప్పేసి పొదివి పట్టుకుంది. KP-2 దాడి చేసిన పెద్ద దూడ మెడ భాగంలో రక్తం ధారాళంగా కారుతుంది. KP-2 వదలడం లేదు. చీతా బలం ముందు దూడ బలం సరిపోవడం లేదు అయినా గింజుకుంటుంది. ముందరి రెండు కాళ్లతో బలంగా తన్నుతుంది.

ఆవు ఆఖరి ఆరాటం.. చీతా ఆకలి పోరాటం..

ఆ అలికిడికి, అరుపులకు ఇంట్లో నుండి వచ్చి చూసాడు



యజమాని. ముందుకు అడుగెయ్యడానికి ధైర్యం చాలలేదు. భయంతో అరవడం మొదలు పెట్టాడు. గ్రామస్థులంతా ఒక్కొకరిగా పోగయ్యారు కానీ చీతాకు దగ్గరగా వెళ్లే ధైర్యం ఏ ఒక్కరికీ లేదు. అయిదు నిమిషాల పోరాటం తర్వాత మెడ మీద నరం తెగడంతో దూడ విగత జీవి అయింది. చీతా అక్కడే ఉండి ఓ వైపు మనుషులకు బెదురుతూనే, మరో వైపు కాలే కడుపు నింపుకొడానికి ఆరాటపడుతూ దూడను తినసాగింది. ఈలోగా జనాలు కాగడాలు పట్టుకుని వచ్చి చీతాను బెదరగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకొందరు పొడవైన కర్ర సహాయంతో చీతా డొక్కలో పొడుస్తున్నారు. వాళ్లకూ భయంగానే ఉంది. జీవుడు కాస్త శాంతించగానే, మనుషుల వింత చేష్టలు భరించలేక, ఆక్రోశంతో వాళ్ళ మీద గర్జిస్తూ అక్కడినుండి పరుగు లంఖించుకుంది. మూతి చుట్టూ రక్తం. నాలుకతో రక్తపు మరకలు తుడుచుకుంటూ.. గమ్యం తెలియని కొత్త దారుల వెంట సరికొత్త జీవన ప్రయాణం మొదలైంది. ఆ ప్రయాణంలో చీతా మధ్యప్రదేశ్ గ్రామాల్లో కనిపించిందంటూ ఆవుపై దాడి చేసిందంటూ టీవీ చానెల్స్ ఉదరగొడ్తున్నాయి. అయినా ఆగలేదు వాడి ప్రయాణం. గడ్డి మైదానాలు దాటి, పొదల మధ్యగా KP-2 ముందుకు సాగుతూనే ఉన్నాడు. Part-2 పగలు దాక్కుని, రాత్రి నిశ్శబ్దంగా చేస్తున్న చీతా ప్రయాణంలో గంటలు, రోజులు గడిచిపోతున్నాయి. గ్రామాల పొలిమేరలు చేరుకున్నప్పుడు, మనిషి వాసన, అలికిడి కొత్తగా అనిపిస్తుంది. భయంతో మొరిగే కుక్కల అరుపులు, మిణుకుమిణుకుమనే లైట్లు దానికి తెలియని కొత్త ప్రపంచం. అన్నింటినీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ, అర్థం కాని వాటికి దూరంగా నడుస్తూ నెల రోజుల తర్వాత రాజస్థాన్ లోని బరాన్ జిల్లా చేరుకున్నాడు.ఆకలి, దప్పిక, పరుగు నిరంతర పోరాటం కలగలసిన 118 కిలోమీటర్ల ప్రయాణం. మరొక రాత్రి కడుపు ఖాళీగానే గడిచింది. ఎటు చూసినా జింకలు, దుప్పులు ఆఖరికి కుందేళ్లు కూడా కనిపించలేదు. అప్పుడు కడుపు రగిలిపోతున్న ఆ స్థితిలో ఒక ఊరిలో మేకల మంద కనపడింది. అందులో ఒక మేక పిల్లను ఎంచుకున్నాడు. ఇప్పుడున్న తానున్న స్థితిలో అది సులభమైన వేట. చీతా చూపులన్నీ దాని మీదే ఉన్నాయి. చీతా మేకపిల్లను చంపుకుని తినిందనే వార్త నేషనల్ మీడియా ప్రసారం చేసింది. దాన్ని పట్టుకుని అదిగో మేకపిల్ల, ఇదిగో ఆవు అంటూ సోషల్ మీడియా వెర్రి వింతలు పుంఖాను పుంఖాలుగా బయటికి వచ్చాయి. ఎక్కడెక్కడి జంతు ప్రేమికులంతా తమ ఆవేదన వ్యక్తం చేశారు. మనుషులకు అదొక నేరంలా కనిపిస్తోంది. నిజానికది దాని జీవన విధానం. ప్రకృతి ధర్మం. ఒక జీవిని తినకుంటే మరొక జీవి మనుగడ సాగించలేదు. మీడియా, సోషల్ మీడియా, జంతు ప్రేమికుల బాధలకతీతంగా కునో ప్రాంతపు అటవీ సిబ్బంది చీతా కదలికలు ఎప్పటికప్పుడు కనిపెడుతూనే ఉన్నారు. దాని మెడలో ఉన్న GPS tracker తో ఇవన్నీ సిబ్బందికి తెలుస్తాయని చీతాకు తెలియదు. అలా రెండొందల కిలోమీటర్లు ప్రయాణం తర్వాత కోటా జిల్లా లోకి ప్రవేశించింది. చీతా కదలికలు ఎక్కడిక్కడ జనాలకు తెలుస్తుండడంతో దాని కోసం ఎగబడుతున్నారు జనాలు. సెల్ ఫోన్లు, కెమెరాలతో ఫోటోలు తీస్తున్నారు అంతా. అదంతా విసుగు తెప్పిస్తోంది చీతాకు. ఈ మనుషులు పట్టుకుంటే వదలరని తల్లి హెచ్చరిక పదే పదే గుర్తుకొస్తోంది. ఒకపక్క భయపడుతూనే మరొకపక్క గేలి చేస్తున్నారు. ఈ చర్యల వల్ల ఆ వన్యప్రాణి ఎంత ఒత్తిడికి గురవుతున్నది వాళ్లకు పట్టడం లేదు. మొత్తంగా జనాలకు కావలసింది ఈ చీతాను అడ్డం పెట్టుకుని సోషల్ మీడియాలో తాము వైరల్ అవ్వడం. చీతా ప్రయాణంలో మరొక వంద కిలోమీటర్లు పూర్తయ్యాయి. తెలియని ప్రపంచం, ఆకలి, మనుషుల వింత చేష్టలతో పూర్తిగా అలసిపోయి కనీస ప్రతిఘటనకు కూడా ఆస్కారం లేకపోతోంది. ఈ మనుషుల నుంచి, వికృత చేష్టలకు దూరంగా తనదైన స్వేచ్ఛా ప్రపంచంలోకి ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అన్నట్టుంది KP-2 మానసిక స్థితి. ఆ కల్లోల స్థితిలో పగలే అడుగు బయటపెట్టక తప్పలేదు చీతాకు. ఆకలి తీరే అవకాశం లేదు కనీసం దప్పికైనా తీర్చుకుందామని నదిని వెతుకుతూ వెళ్ళింది. చుక్క నీరు లేని ఎడారిలా ఉందది. ఈలోగా సోషల్ మీడియాలో చీతా ఫోటోలు వీడియోలు వైరల్ అవడంతో కునో అటవీ సిబ్బంది ముందు జాగ్రత్తగా రాజస్థాన్ కోటా జిల్లా అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారులు హుటాహుటిన ఆ గ్రామం చేరుకొని ఆకతాయిల చెర నుండి చీతాను కాపాడి స్వేచ్ఛ గా వదిలి వేశారు. 'దేవుడున్నాడు రా' అనుకుంటూ పరుగు లంఖించి, ఎడారి నది మీదుగా ప్రయాణిస్తూ ఓ గ్రామం శివారులో ఉన్న ఓ ట్యాంక్ దగ్గర ఆగి, నీరు తాగి పక్కనే పొదల్లో సేద తీరింది. పగలంతా విజృంభించిన వెలుగు రాత్రిని చీకట్లకు అప్పగిస్తోంది. దగ్గర్లో ఏ అడవి కనిపించడం లేదు. అసలు ఉందా లేదా? ఆవాసం దొరుకుతుందా లేదా? ఇంతదూరం ప్రయాణించిన శ్రమ వృధాయేనా అనే ఆలోచనలతో మళ్లీ నడక మొదలు పెట్టింది. గమ్యం తెలియదు కానీ తన సామర్థ్యం మీద నమ్మకం ఉంది. ఆ ప్రయాణంలో ఓ జింకల గుంపు కనిపించింది. ఆగి మాటు వేసి కడుపు నింపుకుని ఆ దట్టమైన అడవిలోకి నడిచింది. దాంట్లోకి అడుగు పెట్టగానే ఇదే తాను చేరాల్సిన గమ్యం అని అనిపించింది దానికి. తన కొత్త నివాసం.. ఆవాసం. అయిదు వందల కిలోమీటర్ల కథ. మధ్యప్రదేశ్ నుంచి ? బరాన్ ? కోటా.. ఇపుడు రాజస్థాన్ అలా రాష్ట్రాల గీతలు చెరుపుతూ తనకే తెలియకుండా ఒక పెద్ద గాథ రాస్తున్నాడు KP-2. గమ్యం ముందే నిర్ణయించుకుని, మ్యాపులు వెతుకుతూ చేసిన ప్రయాణం కాదది. అది వాడి స్వభావం. రణథంబోర్ మరో ప్రపంచం. దట్టమైన వృక్షాలతో పురాతన శిథిలమైన అడవి. ఒక్కప్పటి రాజుల నివాసాల నడుమ ఇప్పుడక్కడ పులులు రాజ్యమేలుతాయి. ఈ అడవి అంతటికి ప్రస్తుత రాణి 'రిద్ది'. ఇక్కడ పులులు, లెపార్డ్ లు కలిసి జీవిస్తున్నాయి. వాటి మధ్యన ఇపుడు KP-2 మరో కొత్త రూలర్ గా ప్రవేశించాడు.ఇది చాలా అరుదు. ఇదొక వింత అంటూ మీడియాలో సోషల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. నెటిజన్స్ మాత్రం ముగ్గురు రూలర్స్ ఒకే అడవిలో ఉండడం అతిశయోక్తి కలిగించే విషయంగా పరిగణిస్తూ KP-2 ఇతర పులులకు బలి కాకూడదని కునో అడవికే తిరిగి తరలించాలని forest అధికారులకు సలహాలు ఇస్తున్నారు. KP-2 కు అంతా కొత్తగా ఉంది. విశాలమైన గడ్డి మైదానాలను, దట్టమైన పొదలను ఆవాసంగా చేసుకునేంత సులువుగా లేదక్కడ. ఇది వేరే రాజ్యం. ఇక్కడ పులులే రాజులు. చెట్ల నీడలో ఎక్కడో ఒక పులి నిద్రపోతుంది. మరో వైపు చిరుత నిశ్శబ్దంగా కూర్చుంది.

అక్కడకి KP-2 వచ్చాడు. ఒకే అడవిలో మూడు 'Big Cats'. పులి, చిరుత, చీతా. అది ప్రకృతిలో అతి అరుదైన సందర్భం. కానీ అడవి కంటే పెద్దది ఇంకో ప్రపంచం ఉంది. ఇదే మనిషి సృష్టికీ చిన బంధనం. ఇది KP-2 కి తెలియదు. వాడి మెడలో ఉన్న చిన్న GPS కాలర్ ప్రతి అడుగును మనుషులకు చెబుతోంది. అధికారులు వాడి ప్రతి కదలికనూ గమనిస్తున్నారు. 'KP-2 చాలా దూరం వెళ్లాడు, ఇప్పుడు ప్రమాదం మరింత పెరుగుతుంది' అని వారు అనుకున్నారు. KP-2 ని ట్రాంక్విలైజ్ చేసి పట్టుకుందాం అనుకున్నారు. కానీ వాడి అయిదొందల కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం మరొక్కసారి ఆలోచించేలా చేసింది. అడవి జంతువులకి గీతలు లేవు. రాష్ట్రాలు, సరిహద్దులు ఇవన్నీ మనుషుల కోసం. KP-2 సాహసానికి ఒక్క అవకాశం ఇచ్చి చూద్దామనే వాదనలు అధికారులు మధ్య జరుగుతున్నాయి. తిరిగి కునో కి పంపిద్దాం అంటూ కొందరు, వద్దు వాడు ఇక్కడే టెర్రిటరీ నిర్మించుకుని బతకగలడు అని మరికొందరి భిన్నాభిప్రాయాల మధ్యన చర్చలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.ప్రస్తుతం ఈ కథ మీరు చదివే రోజు కి అనగా 24 ఏప్రిల్ 2026 వరకు KP-2 రణతంబోర్ అడవిలోకి సురక్షితంగా చేరి 4 రోజులు గడిచాయి. వాడిని ప్రత్యేక సిబ్బంది గమనిస్తూనే ఉన్నారు.అంతం కాదిది, ఆరంభం. ప్రకృతి ఎప్పుడూ తన దారిలోనే నడుస్తుంది. మనిషి గీసిన గీతలు వాటిని ఆపలేవు. మధ్యప్రదేశ్ కునో నేషనల్ పార్క్ నుండి రాజస్థాన్ రణతంబోర్ నేషనల్ పార్క్ వరకు KP-2 ప్రయాణం..



In the Land of tigers a cheetah made history!

రచన: దివ్య కంకణాల

# జనగణనలో భాగంగా రేపటి నుంచి సెల్ఫ్-ఎన్యుమరేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ప్రజాకలం) : జనగణన-2027లో భాగంగా తెలంగాణ రేపటి నుంచి సెల్ఫ్-ఎన్యుమరేషన్ కార్యక్రమం ప్రారంభం కానున్నట్టు డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్, తెలంగాణ డైరెక్టర్ శ్రీమతి భారతీ హోళికెరి తెలిపారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియ ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె పత్రికా సమావేశంలో మాట్లాడారు.

ఈసారి జరుగుతున్న జనగణన ప్రాముఖ్యతను భారతీ హోళికెరి వివరిస్తూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జనగణన అని పేర్కొన్నారు. డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న తొలి జనగణన కూడా ఇదేనని అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారి కులగణన జరుగుతుండటం కూడా ఈసారి జనగణనలో ప్రత్యేకమని పేర్కొన్నారు. ముఖ్యంగా మొదటిసారిగా జనగణన ప్రక్రియలో ఈసారి సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియ పాటిస్తున్నామని, ప్రజలు నేరుగా జనగణనలో పాల్గొనేందుకు ఇది ఒక మంచి అవకాశమని ఆమె చెప్పారు.

ప్రజలు https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా స్వచ్ఛందంగా, సొంతంగా జనగణనకు తమ వివరాలను అందించవచ్చని భారతీ హోళికెరి తెలిపారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ అనేది తప్పనిసరి కాదని, కేవలం ప్రజలకు ఒక సౌలభ్యం మాత్రమేనని, దీని వల్ల జనగణనలో డేటా సేకరణ




వేగవంతమవుతుందని, క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లకు పనిభారం తగ్గుతుందని ఆమె చెప్పారు.

తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సహా 16 భాషల్లో పోర్టల్ పనిచేస్తుందని, ఈ పోర్టల్ అత్యంత సురక్షితమైనదని, ఇందులో డేటా సురక్షితంగా ఉంటుందని తెలిపారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి అనుమానాలు ఉన్నా పోర్టల్‌లో ఉన్న సమాచారం నివృత్తి చేస్తుందని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 1855 హెల్ప్‌లైన్ నెంబరుకు ఫోన్ చేసి కూడా తెలుసుకోవచ్చని చెప్పారు.

జనగణనలోని మొత్తం 33 ప్రశ్నలకు గానూ సెల్ఫ్-ఎన్యుమరేషన్ ద్వారా 27 ప్రశ్నలకు జవాబులు ఇవ్వొచ్చని, మిగతా ఆరు ప్రశ్నలకు సమాధానాలను జనగణన ఎన్యుమరేటర్ వచ్చి నమోదు చేసుకుంటారని తెలిపారు. ప్రజలు ఎలాంటి డాక్యుమెంట్లు, ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియలో జియోఫెన్సింగ్ ఉండదని, ప్రజలు ఎక్కడినుంచైనా ఈ ప్రక్రియను పూర్తిచేయవచ్చని అన్నారు.

జనగణన అనేది అన్ని సర్వేలకు మాతృసర్వే వంటిదని, జనగణన ద్వారా సమగ్రమైన డేటా వస్తుందని ఆమె పేర్కొన్నారు. సరైన విధానాలు, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు జనగణన డేటా అత్యంత కీలకమని అన్నారు. మన కోసం, మన పిల్లల కోసం, భావి తరాల కోసం ఈ జనగణన ముఖ్యమైనదని, కాబట్టి, ప్రజలు కచ్చితత్వంతో తమ వివరాలను ఇవ్వాలని, ఇది ప్రజల బాధ్యత అని ఆమె అన్నారు.

జనగణనలో వచ్చే డేటా క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రతిబింబించే అద్దంలా ఉండాలనేది తమ లక్ష్యమని పేర్కొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)లో జనగణన ప్రక్రియను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వివరించారు. ఒక డివిజన్‌ను యూనిట్‌గా తీసుకొని జనగణన జరపనున్నట్టు చెప్పారు.

క్యూర్ పరిధిలో 21,866 ఎన్యుమరేటర్లు, 3,652 మంది సూపర్‌వైజర్లు జనగణన విధుల్లో ఉంటారని, సర్కిల్‌కు ఒకరు చొప్పున 60 మంది డిప్యూటీ కమిషనర్లు ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటారని, కంటోన్మెంట్‌కు ఒకరు ఇన్‌ఛార్జ్‌గా ఉంటారని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియలో పాల్గొనాలని ఆయన కోరారు.

అనంతరం జనగణనకు సంబంధించిన పోస్టర్, ప్రచార సామాగ్రిని ఆవిష్కరించారు.

## ఏడు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాకలం)మండలంలోని మెట్ల చిట్టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోగల వరి ధాన్య కొనుగోలు కేంద్రాలు విట్టంపేట్, రంగారావు పేట, రామ లచ్చక్కపేట్,ఆత్మకూర్,జగ్గసాగర్, బండలింగాపూర్, రాజేశ్వరరావు పేట,గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏ సి ఎం సి చైర్మన్ కూన గోవర్ధన్ గ్రామ సర్పంచులు ,ఉప సర్పంచ్ లు, డిసిఓ మనోజ్ కుమార్, పి ఏసి నిజాముద్దీన్ లు ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ధాన్యాన్ని నాణ్యత తరలించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. సెంటర్ నిర్వాకులు నిబంధనల ప్రకారం కొనుగోళ్లు చేయాలని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో ఆర్ ఐ ఉమేశ్ డైరెక్టర్ లు మనల లింగారెడ్డి, పుప్పాల గంగాధర్ పై రైతులు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## సర్కారు దవాఖానలో సేవలు మెరుగుపడాలి

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,ఏప్రిల్ 25:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

గోదావరిఖని జనరల్ హాస్పిటల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం గోదావరిఖని జనరల్ హాస్పిటల్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రి వసతులపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆప్తమాలజీ విభాగంలో కంటి ఆపరేషన్లు తక్షణమే ప్రారంభించేందుకు అవసరమైన అన్ని యంత్రాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కంటి పరీక్షలను విస్తృతంగా నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. డెంటల్ విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్,ప్రస్తుతం సగటున 40 మంది మాత్రమే ఓపీకి వస్తున్నట్లు గమనించి,ఆ సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన యంత్రాలు సమీకరిస్తున్న నేపథ్యంలో సేవలను మరింత విస్తరించాలని సూచించారు. ల్యాబ్ విభాగంలో పరీక్షలు త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని,ఆసుపత్రి నిర్వహణను పూర్తిగా సక్రమపరచాలని ఆదేశించారు. అన్ని సాఫ్ట్‌వేర్లను అప్డేట్ చేసి,పరీక్షల ఫలితాలను ఆలస్యం లేకుండా ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృపాభాయ్,డాక్టర్ రాజు,ఆప్తమాలజిస్టు డాక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## అన్నదాతలకు అండగా ప్రజా ప్రభుత్వం

### - ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లి,ఏప్రిల్ 25 (ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని,అన్నదాతల కష్టాలను తీర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లి మండలం రాఘవాపూర్,అప్పన్నపేట గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన స్థానిక నాయకులు,రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కోతల పేరుతో రైతుల శ్రమను దోచుకున్నారని విమర్శించారు. దానికి భిన్నంగా నేడు కాంగ్రెస్ సర్కార్ రైతుల మన్ననలు పొందేలా కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసిందని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం సూచించిన విధంగా 15 శాతం తేమ వచ్చేలా ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. అకాల వర్షాలు కురిసినా ధాన్యం తడవకుండా అధికారులు అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,కేంద్రాల వద్ద ధాన్యపు ధరల పట్టికలను అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని,రైతులెవరూ ఇబ్బంది పడకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,వ్యవసాయ మార్కెట్ చైర్మన్,డైరెక్టర్లు,వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నాయకులు

గొల్లపల్లి ఏప్రిల్ 25 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండలం లోత్తునూర్ గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని దళారులను నమ్మి మోసపోవద్దని ధాన్యం సరైన తేమ శాతం ఉండేలా చూసుకోవాలని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సి చైర్మన్ భీమా సంతోష్,గ్రామ సర్పంచ్ ఆకుల సుమన్ గౌడ్,ఉప సర్పంచ్ ఒగరింటి మల్లేష్ , వార్డు సభ్యులు బోనాల రాజు కొప్పు శ్రీను, కదారి నరేష్ రావు,చిరుత తిరుపతి, కొప్పు మొండయ్య, నరేష్,తిరుపతి, మొండయ్య, పీఏసీఎస్ సిబ్బంది హాఫీజ్,మహేష్,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు



## మలేరియా రహిత సమాజం కోసం

# సమిష్టిగా కృషి చేద్దాం

### - డీఎంహెచ్ఓ డాక్టర్ కె.ప్రమోద్ కుమార్

పెద్దపల్లి,ఏప్రిల్ 25:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

మలేరియా నిర్మూలన కేవలం ప్రభుత్వ లక్ష్యం మాత్రమే కాదు,ప్రతి పౌరుని బాధ్యత.సమిష్టి కృషితోనే మన జిల్లాను కీటక జనిత వ్యాధుల రహితంగా మార్చుకోగలమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ అన్నారు.ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శనివారం భారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.జిల్లా ప్రధాన ఆసుపత్రి నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని డాక్టర్ ప్రమోద్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు.వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు మలేరియాను తరిమికొడదాం- ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేస్తూ అయ్యప్ప స్వామి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం తిరిగి జిల్లా ఆసుపత్రి వద్ద ముగిసిన ఈ ప్రదర్శన ద్వారా ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా మాత్రమే కాకుండా డెంగ్యూ,చికెన్ గున్యా,ఫైలేరియా,జికా మరియు మెదడువాపు వంటి ప్రమాదకర వ్యాధులు వస్తాయని,వీటిని ఆదిలోనే అరికట్టాలని సూచించారు.చలితో కూడిన జ్వరం,తీవ్రమైన తలనొప్పి, వాంతులు,కండరాలు లేదా కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు




కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత రక్త పరీక్ష చేయించుకోవాలని కోరారు.ప్రతి మంగళ, శుక్రవారాలను డ్రై డే గా పాటించి,ఇంట్లో నిల్వ ఉన్న నీటి పాత్రలను శుభ్రం చేసుకోవాలని,సెప్టిక్ ట్యాంక్ గొట్టాలకు నైలాన్ జాలి కట్టడం,పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు.వ్యక్తిగత రక్షణ కోసం దోమతెరలు వాడాలని మరియు శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించాలని సూచించారు.గ్రామాల్లో మురుగు కాలువలను శుభ్రంగా ఉంచుకోవాలని,ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో వేయకూడదని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ బి.శ్రీరాములు,డాక్టర్ కె.వి.సుధాకర్ రెడ్డి,వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీలో నిధుల 'గోల్‌మాల్'

### - వెన్నంపల్లి పంచాయతీ కార్యదర్శి అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

### - విచారణ చేపట్టిన డీఎల్‌పీఓ దేవకి దేవి



పెద్దపల్లి,ఏప్రిల్ 25 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలనలో నిధులు దుర్వినియోగం అయ్యాయన్న ఆరోపణల నేపథ్యంలో శనివారం ఉన్నతాధికారుల విచారణ కొనసాగింది.గ్రామానికి చెందిన కరబుజ రవి కుమార్ గతంలో జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు,డీఎల్‌పీఓ దేవకి దేవి గ్రామాన్ని సందర్శించి పంచాయతీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఫిర్యాదుదారు రవి కుమార్ ఆరోపణల ప్రకారం..2 ఫిబ్రవరి 2024 నుండి 21 డిసెంబర్ 2025 వరకు కొనసాగిన ప్రత్యేక అధికారి పాలన కాలంలో పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సాధారణ నిధులను భారీగా పక్కదారి పట్టించారు.పారిశుధ్య పనులకు వాడే ట్రాక్టర్ల డీజిల్,సిమెంట్ కొనుగోళ్లలో తప్పుడు లెక్కలు చూపడమే కాకుండా,నకిలీ వోచర్ల ద్వారా నిధులను కాజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.వీటితో పాటు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో నిబంధనలు అతిక్రమించారని, గ్రామ పన్నుల వసూళ్లలో తీవ్రమైన అవకతవకలు జరిగాయని ఆరోపించారు.ముఖ్యంగా ప్రజలకు ఇచ్చిన చేతి రశీదులకు,ఆన్‌లైన్ రికార్డులకు మధ్య ఎటువంటి పొంతన లేదని,పన్ను రికార్డులను కావాలనే అప్‌డేట్ చేయలేదని రవి పేర్కొన్నారు.ఈ విచారణపై డీఎల్‌పీఓ దేవకి దేవి స్పందిస్తూ.. పంచాయతీ రికార్డులను పూర్తిగా పరిశీలించి,సేకరించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో సమర్పిస్తామని తెలిపారు.గ్రామ అభివృద్ధి నిధులను వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకున్న పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్‌పై పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఫిర్యాదుదారు కోరారు.

# నాడు శాపం.. నేడు ప్రగతి పథం

### - సుల్తానాబాద్ మున్సిపల్ అభివృద్ధిపై ఎమ్మెల్యే ధీమా

సుల్తానాబాద్,ఏప్రిల్ 25 (ప్రజాకలం జిల్లాప్రతినిధి)

సుల్తానాబాద్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి,వంద శాతం ప్రగతి సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు.శనివారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో నిర్వహించిన ప్రజాపాల-నప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ అమీరిశెట్టి శ్రావణి రాకేష్,కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆయన కాలనీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల పదేళ్ల నిర్లక్ష్య వైఖరి వల్ల సుల్తానాబాద్ పట్టణం ఎంతో నష్టపోయిందని,గత పాలకులు చేసిన పాపమే నేడు పట్టణానికి శాపంగా మారిందని విమర్శించారు.వారు పట్టణాన్ని భ్రష్టు పట్టించినప్పటికీ,తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నర ఏళ్లలోనే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టి చూపామని స్పష్టం చేశారు.ఒక్క 12వ వార్డులోనే గతంలో రూ.60 లక్షల పనులు




పూర్తి చేయగా,ప్రస్తుతం రూ.98 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ..రూ.500లకే గ్యాస్,జీరో కరెంట్ బిల్లు,ఇందిరమ్మ గృహాలు,సన్న బియ్యం మరియు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచి పేదలకు అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మహిళల ఆర్థికాభివృద్ధి కోసం వడ్డీ లేని రుణాలు,పావలా వడ్డీ పథకం కింద రూ.2 లక్షల వరకు సాయం అందిస్తున్నామని,త్వరలోనే కొత్త భీమా పథకాన్ని కూడా ప్రవేశపెడతామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ,మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు,పలు వార్డుల కౌన్సిలర్లు,కాంగ్రెస్ శ్రేణులు,కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## రిటైర్మెంట్ అయిన హోం గార్డు అఫ్జల్ కు ఘన సన్మానం

కరీంనగర్ ప్రతినిధి ఏప్రిల్ 25 ( ప్రజా కలం) కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ 42 సంవత్సరాలపాటు అంకితభావంతో సేవలందించిన హోం గార్డ్ అఫ్జల్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖకు ఆయన అందించిన సేవలు, క్రమశిక్షణ, నిజాయితీ, విధి నిబద్ధతను స్మరించుకుంటూ స్టేషన్ సిబ్బంది ఘనంగా సత్కరించారు.అఫ్జల్ తన సేవా కాలంలో ఎప్పుడూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి, ఉన్నతాధికారుల ఆదేశాలను కచ్చితంగా పాటిస్తూ,సహచరులకు ఆదర్శంగా నిలిచారు.పదవీ విరమణ సందర్భంగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అఫ్జల్ ని శాలువాలతో సత్కరించి, పుష్ప గుచ్ఛాలు అందజేసి, ఆయన సేవలను ప్రశంసించారు. పలువురు అధికారులు మాట్లాడుతూ, అఫ్జల్ సేవలు పోలీస్ శాఖకు ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్



రెడ్డి, ఎస్సై లు నరేష్ , లక్ష్మా రెడ్డి మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా అఫ్జల్ మాట్లాడుతూ, తనకు సహకరించిన అధికారులు, సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ శాఖలో పనిచేసిన ఈ దీర్ఘ ప్రయాణం తనకు గర్వకారణమని, భవిష్యత్తు లో కూడా సమాజానికి సేవ చేయాలనే తపనతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు.అఫ్జల్ కి పదవీ విరమణ అనంతరం ఆరోగ్యం, ఆనందం, శాంతి నిండిన జీవితం కలగాలని పోలీస్ సిబ్బంది ఆకాంక్షించారు.

## నేడు ఆర్యవైశ్య కుల దైవం వాసవి మాత

# అమ్మవారి జయంతి ఉత్సవం

ఎండపల్లి, ఏప్రిల్ 25 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం అంబారిపేట గ్రామానికి చెందిన ఆర్యవైశ్య పేద కుటుంబాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సముద్రాల రమేష్ గుప్తా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కుల దైవం శ్రీ వాసవి మాత అమ్మవారి జయంతి ని కాల్వ సుజాత గుప్తా చొరవ తో ప్రభుత్వం అధికారంగా ప్రకటన చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు వాసవి మాత జయంతిని పురస్కరించు కొని ఆదివారం రోజున రవీంద్ర భారతి లో తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత గుప్త నేతృత్వం లో ప్రభుత్వం అధికారంగా వాసవి మాత అమ్మవారి కార్యక్రమాలు జరుపుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్యవైశ్య పేద కుటుంబాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సముద్రాల రమేష్ గుప్త రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



## లక్ష్యానికి అనుగుణంగా పట్టణ అభివృద్ధి

### - మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య



పెద్దపల్లి,ఏప్రిల్ 25:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి పట్టణంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య శనివారం వార్డు కౌన్సిలర్లు మరియు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా 4వ వార్డులోని హనుమాన్ నగర్,రైల్వే స్టేషన్ రోడ్డులో 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను,10వ వార్డులోని క్రిస్టియన్ స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణాన్ని వారు పరిశీలించారు. అలాగే 5వ వార్డులోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఉన్న మహిళా పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారి సౌకర్యార్థం18 లక్షల రూపాయలతో చేపట్టిన రేకుల షెడ్డు మరియు టాయిలెట్ల నిర్మాణ పనులను పరిశీలించి,నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. పట్టణ అభివృద్ధికి సహకరిస్తున్న కౌన్సిలర్లకు,మున్సిపల్ కమిషనర్‌కు,సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్లు కొమ్ము సుధాకర్,గుజ్జుల కుమార్,అక్కేపల్లి సుజాత క్రాంతి,పూదరి అనూష మహేందర్,ఏఈ సతీష్,వార్డ్ ఆఫీసర్లు శ్రీనివాస్,సాగర్,వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సం

### - పెను ప్రమాదాన్ని తప్పించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ అనిల్




సుల్తానాబాద్,ఏప్రిల్ 25:(ప్రజాకలం జిల్లాప్రతినిధి

మద్యం మత్తులో లారీ నడుపుతూ దారిపొడవునా ప్రమాదాలకు కారణమవుతున్న ఒక డ్రైవర్‌ను ట్రాఫిక్ కానిస్టేబుల్ సిరికొండ అనిల్ సమయస్ఫూర్తితో అడ్డుకున్నారు.పూసాల క్రాస్ రోడ్ నుండి సుల్తానాబాద్ తెలంగాణ చౌక్ వరకు సదరు లారీ డ్రైవర్ వాహనాన్ని అదుపులేకుండా నడుపుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేశాడు.ఈ విషయాన్ని గమనించిన కానిస్టేబుల్ అనిల్,ఆ లారీ తన విధి నిర్వహణ పాయింట్‌కు రాగానే చాకచక్యంగా అడ్డుకుని నిలిపివేశారు.వెంటనే ఆయన తన పై అధికారులకు మరియు సుల్తానాబాద్ లా అండ్ ఆర్డర్ బ్లూ కోట్స్ పోలీసులకు సమాచారం అందించారు.ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవర్‌ను తనిఖీ చేయగా,అతను మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు నిర్ధారణ అయింది.దీంతో డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించి,తృటిలో తప్పిన పెద్ద ప్రమాదాన్ని నివారించారు.సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణనష్టం జరగకుండా అడ్డుకున్న కానిస్టేబుల్ అనిల్‌ను పలువురు అభినందించారు.

## అక్రమంగా మొరం తరలిస్తు న్న రెండు టిప్పర్ లారీలు పట్టివేత

కరీంనగర్ ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజా కలం) శనివారం ఉదయం 5 గంటల సమయంలో రెండు టిప్పర్లలో అక్రమంగా రామడుగు మండలంలోని లక్ష్మీ పూర్ గ్రామ శివారులో ఉన్న తెనాలి నుండి ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని అక్రమంగా కరీంనగర్ కి తరలిస్తుండగా తీగలగుట్టపల్లి వద్ద మట్టితో ఉన్న లారీలను కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకొని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకొని వచ్చి అట్టి లారీ ఓనర్, ఇద్దరు డ్రైవర్లపై కేసునమోదుచేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపినట్లు మరియు ఇక నుండి ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న తెనాలి మరియు చుట్టుపక్క ప్రాంతాలలో ఉన్న మట్టిని అక్రమంగా తీసుకొని వచ్చినట్లయితే కఠినంగా చర్యలు తీసుకుని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు



## బోల్సా గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



తానూర్, ఏప్రిల్ 25(ప్రజా కలం): నిర్మల్ జిల్లా తానూర్ మండలం బోల్సా గ్రామంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించి గోసల హన్మండ్లుకు చెందిన ఇల్లు పూర్తిగా కాలిపోయింది, ఇంట్లో ఉన్న సామాగ్రి, ఆహారపు ధాన్యాలు, బట్టలు దగ్ధమయ్యాయి, అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది, స్థానికులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలను ఆర్పారు, ఈ ఘటనలో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



( వరంగల్/ పర్వతగిరి ) ఏప్రిల్ 25, ప్రజాకలం ప్రతినిధి.

వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ విశ్రాంత అటెండర్ పంతంగి ఉప్పలయ్య శుక్రవారం గుండెపోటుతో మృతి చెందగా విషయం తెలుసుకొని శనివారం వారి నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి కుటుంబానికి మనోధైర్యం చెప్పారు. అనంతరం అదే గ్రామానికి చెందిన చింతకాయల మల్లమ్మ ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి వారి చిత్రపటానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన కొల్లూరి దేవేందర్ ఇటీవల గడ్డి కట్టలు కట్టే యంత్రంలో చేయి వేళ్లు చిక్కుకుని తీవ్రంగా గాయపడగా, సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని నేడు ఆస్పత్రికి వెళ్లి దేవేందర్‌ను పరామర్శించి మనోధైర్యం కల్పించి ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి దేవేందర్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూచించిన మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ పరామర్శలో మాజీ మంత్రి గారితో యం. మనోజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, స్థానిక సర్పంచ్ డెక్క సునీత – కుమారస్వామి, మాజీ సర్పంచ్ అమడగని రాజు యాదవ్, మండల సీనియర్ నాయకులు బొట్ల మధు, జట్టుకొండ చిన్ననర్సయ్య , పట్టాపురం ఎల్లగౌడ్, పల్లె ప్రకాష్, బోయినపెల్లి స్వామిరావు, కొందటి కుమార్ రావు, గ్రామస్తులు బైరి ఎల్లయ్య, మోడం రమేష్, రావుల రవి, అలుగురి ఎల్లయ్య, సాయిలు, కరిమిళ్ల సంపత్ రావు, మండల సోషల్ మీడియా నాయకులు చిన్నపెల్లి అజయ్, బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## తానూర్ లో చిన్నారులపై కుక్కల దాడి!





తానూర్, ఏప్రిల్ 25(ప్రజా కలం): నిర్మల్ జిల్లా తానూర్ మండల కేంద్రంలో శుక్రవారం వీధి కుక్కలు రెచ్చిపోయాయి, ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై దాడి చేసి గాయపరిచాయి, స్థానికులు వెంటనే అప్రమత్తమై కుక్కలను తరిమికొట్టి, చిన్నారులను భైంసా ఆసుపత్రికి తరలించారు, ప్రస్తుతం వారికి చికిత్స అందుతోంది, తానూర్‌లో వీధి కుక్కల సంఖ్య పెరుగుతోందని, పిల్లలు బయటకు రావాలంటేనే తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## స్వీయ గణన సదుపాయం వినియోగించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 2027 జన గణనలో భాగంగా ఇండ్ల జాబితా తయారీకి పకడ్బందీ చర్యలు
- ఆన్‌లైన్ స్వీయ గణనకు ప్రత్యేక వెబ్‌సైట్ వినియోగించాలని సూచన

ఖమ్మం ఏప్రిల్ 25(ప్రజా కలం న్యూస్ )

జనగణన–2027లో భాగంగా స్వీయ గణన సదుపాయం వినియోగించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జన గణన 2027 మొదటి దశ ప్రక్రియ అయిన ఇండ్ల జాబితా



తయారీ కార్యక్రమం 2026 మే 11 నుండి జూన్ 9 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ గణనలో భాగంగా మొట్టమొదటిసారిగా స్వీయ గణన (Self-Enumeration) సదుపాయాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చిందని, ఈ సదుపాయం 2026 ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు 15 రోజుల పాటు https://se.census.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. జిల్లా ప్రజలు తమ మొబైల్ నెంబర్‌తో పోర్టల్‌లో లాగిన్ అయి, తమ గృహాన్ని జియో–ట్యాగ్ చేసి అవసరమైన వివరాలను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత "H" అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల Self-Enumeration ID (SE ID) జనరేట్ అవుతుందని తెలిపారు.

‡ SE IDను ఫీల్డ్ వెరిఫికేషన్ కోసం ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్‌కు అందజేస్తే గణన ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు అందరూ ఈ స్వీయ గణన సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆ ప్రకటనలో కోరారు.

## రోగర్స్ సిండ్రోమ్ వ్యాధికి విజయవంతంగా చికిత్స అందించిన వరంగల్ మెడికవర్ వైద్యులు

హనుమకొండ ఏప్రిల్ 25 ప్రజా కలం ప్రతినిధి

వరంగల్‌లో మెడికవర్ హాస్పిటల్ వైద్యులు అరుదైన ఘనత సాధించారు. ప్రపంచవ్యాప్తంగా వందకు లోపే కేసులు నమోదైన అత్యంత అరుదైన "రోగర్స్ సిండ్రోమ్" వ్యాధిని 2 నెలల శిశువులో గుర్తించి విజయవంతంగా చికిత్స అందించారు. శిశువును మొదట తీవ్ర రక్తహీనత (అనీమియా) తో ఆసుపత్రికి తీసుకురాగా అనంతరం నిర్వహించిన పరీక్షల్లో రక్తం చక్కెర స్థాయిలు 500 mg/dL కంటే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి వైద్యులు అప్రమత్తమయ్యారు. పెడియాట్రిక్స్ విభాగాధిపతి డా. అశ్రిత రావు పర్యవేక్షణలో శిశువుకు తక్షణమే రక్త మార్పిడి చేసి, రక్తంలో చక్కెరను నియంత్రించేందుకు స్లైడింగ్ స్కేల్ విధానంలో ఇన్సులిన్ చికిత్స ప్రారంభించారు.

అసలు కారణాన్ని గుర్తించేందుకు సమగ్ర పరీక్షలు నిర్వహించగా, కన్సల్టెంట్ పాథాలజిస్ట్ డా. లత మంచాలా, డా. అశ్రిత రావు కలిసి బోన్ మారో ఆస్పిరేషన్ చేశారు. అదనంగా ఆధునిక జన్యు పరీక్ష అయిన Whole Exome Sequencing ద్వారా ఈ అరుదైన రోగర్స్ సిండ్రోమ్




నిర్ధారణ అయిందనీ, సకాలంలో చికిత్స, విభిన్న వైద్య విభాగాల సమన్వయం, నిరంతర పర్యవేక్షణతో శిశువు ఆరోగ్యం మెరుగుపడి ప్రస్తుతం స్థిరంగా ఉండడంతో డిశ్చార్జ్ చేశామని తగిన వైద్య సూచనలు ఫాలో–అప్ ప్లాన్ కూడా అందించామని ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ శిశువుల్లో అరుదైన ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కోవడంలో ముందస్తు గుర్తింపు, ఆధునిక నిర్ధారణ పద్ధతులు మరియు సమన్వయ వైద్యం అత్యంత కీలకమని తెలిపారు. వరంగల్ మెడికవర్ హాస్పిటల్ వైద్యులు అత్యంత క్లిష్టమైన మరియు అరుదైన కేసుల్లో కూడా ఆధునిక, నాణ్యమైన మరియు కరుణతో కూడిన వైద్య సేవలను అందిస్తూ మరోసారి తన ప్రతిభను నిరూపించామన్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా సర్పంచ్ కొండ రాజమ్మ

### - ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా



మల్హార్, ఏప్రిల్ 25 ప్రజాకలం ప్రతినిధి

మండలంలోని కొయ్యూరు గ్రామానికి చెందిన గుంటి లక్ష్మయ్య ఇటీవల మరణించగా తొమ్మిదవ రోజు సందర్భంగా, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు మరియు శ్రీనుబాబు ఆదేశాల మేరకు శనివారం కొయ్యూరు గ్రామ సర్పంచ్ కొండ రాజమ్మ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి 25 కేజీల బియ్యం బ్యాగును మరియు నిత్యావసర సామాగ్రిని అందజేశారు. ప్రభుత్వం మరియు తామంతా ఎల్లవేళలా ఆ కుటుంబానికి అండగా ఉంటామని ఆమె భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు యూత్ అధ్యక్షులు లాకావత్ రాజేందర్, దేవాలయ కమిటీ అధ్యక్షులు లచ్చయ్య, సీనియర్ నాయకులు రవీందర్ నాయక్, పెరుమళ్ళ మల్లేష్, గుంటి బాపు, బిస్కుల అశోక్, సురేష్, శ్రీనివాస్, పెరుమండ్లసమ్మయ్య, గుంటిరాజయ్య, జంగ సత్యం, ఎల్లయ్య, కుమార్, నిరటి విష్ణువర్ధన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే పుట్ట మధన్న కృషితోనే

## నియోజకవర్గం అభివృద్ధి

### - మండల బిఆర్ఎస్ నాయకులు

మల్హార్, ఏప్రిల్ 25 ప్రజాకలం ప్రతినిధి

మల్హార్ రావు మండల అభివృద్ధి బిఆర్ఎస్ హయాంలోనే సాధ్యమైందని, కిషన్రావుపల్లి – భూపాలపల్లి అటవీ అనుమతులు మా నాయకుడు పుట్ట మధు 2023 జెడ్పీ చైర్మన్ గా ఉన్న సమయంలో అనుమతులు తీసుకొచ్చారని బిఆర్ఎస్ నాయకులు అన్నారు. శనివారం పెద్దతూండ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీధర్ బాబు కు మండల అభివృద్ధి పై ఏ మాత్రం చిత్త శుద్ధి లేకనే పనుల్లో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ప్రత్యేక చొరవతో ఖమ్మంపల్లి బ్రిడ్జి, ఆరేవాగు, శాతరాజుపల్లి బ్రిడ్జిలు, బిటి రోడ్డు వంటి పనులకు అనుమతులు వచ్చాయని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అటవీ అనుమతులు తీసుకురావడంలో విఫలమయ్యారని, బిఆర్ఎస్ ఆందోళనల వల్లే ఇప్పుడు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అబద్ధపు హామీలతో



కాలం గడుపుతున్న కాంగ్రెస్, అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. తాడిచర్ల – అందుగుతండ బిటి రోడ్డు నిర్మాణంతో పాటు శాతరాజుపల్లి – నాచారం రోడ్డుకు వెంటనే అటవీ అనుమతులు తీసుకొస్తే ఈ మండల అభివృద్ధి పై మీ నాయకుడి చిత్తశుద్ధి ఉన్నట్లుగా భావిస్తాం అని అన్నారు.. ఈ కార్యక్రమంలో పెద్దతూండ్ల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నారా రమేష్, మాజీ సర్పంచ్ విజయ–నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు మందపల్లి శ్రీధర్, జక్కుల లక్ష్మయ్య, కందుగుల రఘుపతి, వీరరెడ్డి, తోట బాపు, చంద్రయ్య, బుచ్చిరెడ్డి, కిషన్ రావు, నారా సమ్మయ్య, నారా రవికుమార్, సురేష్, దేవేందర్, మహేష్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఏడాది తర్వాత రన్యా రావుకు బెయిల్

బెంగళూరు : దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కన్నడ నటి రన్యా రావు బంగారం స్మగ్లింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న నటికి.. ఎట్టకేలకు బెయిల్ మంజూరయ్యింది. ఏడాది నుంచి ఆమె బెయిల్ కోసం చేస్తోన్న ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. ప్రస్తుతం రన్యా రావు పరప్పన అగ్రహారం సెంట్రల్ జైల్లో ఖైదీగా ఉన్నారు. బంగారం అక్రమ రవాణా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ.. ఏడాది నుంచి జైల్లో ఉన్న కన్నడ నటి రన్యా రావుకు ఊరట లభించింది. కర్ణాటక కోర్టు ఆమెకు బుధవారం నాడు బెయిల్‌ను మంజూరు చేసింది. మొత్తం రూ.102 కోట్ల విలువైన బంగారాన్ని దుబాయ్ నుంచి దేశానికి అక్రమంగా తరలించారనేది ప్రధాన ఆరోపణ. ఆర్థిక నేరాల విచారణ న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో రన్యా రావు జైలు నుంచి త్వరలోనే విడుదల కానున్నారు. దుబాయ్ నుంచి బెంగళూరుకు 14.8 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలిస్తుండగా గతేడాది మార్చి 3న కెంపెగౌడ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులకు రన్యా రావు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ భారీ స్మగ్లింగ్ కేసు దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. కర్ణాటక సీనియర్ పోలీస్ అధికారి కే. రామచంద్రరావుకు రన్యా రావు సవతి కూతురు. ఈ కేసులో ఆయన పాత్రపై కూడా అప్పట్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ కేసులో ఏడాది నుంచి బెంగళూరులోని పరప్పన అగ్రహారం సెంట్రల్ జైల్లోనే నటి రన్యా రావు ఉన్నారు. ఆమె బెయిల్ కోసం అనేకసార్లు చేసిన ప్రతిపాదనలను కోర్టులు తిరస్కరించాయి. కేసు తీవ్రత దృష్ట్యా హైకోర్టు ఆమె బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. అంతేకాదు, రన్యా రావుపై




'విదేశీ మారక ద్రవ్య రక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణ' చట్టం కింద కేసు నమోదయ్యింది. ఈ చట్టం కింద అరెస్టైన వారు తప్పనిసరిగా ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అందుకే గత ఏడాది కాలంగా బెయిల్ కోసం ఆమె చేసిన ప్రయత్నాలు విఫలయమ్యాయి. రూ. 102 కోట్ల విలువైన బంగారం స్మగ్లింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రన్యా రావు పాత్రపై పక్కా ఆధారాలతో ప్రత్యేక కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. సీనియర్ ఐపీఎస్ అధికారికి ఆమె సవతి కుమార్తె కావడంతో తనను ఎవరూ తనిఖీ చేయరనే ధైర్యంతో బంగారం స్మగ్లింగ్‌కు తెరతీసింది. కేవలం 15 రోజుల వ్యవధిలో రన్యా రావు నాలుగు సార్లు దుబాయ్ పర్యటనకు వెళ్లడం అనుమానం రేకెత్తించింది. దీంతో 2025 మార్చి 3న దుబాయ్ నుంచ తిరిగొస్తుండగా విమానాశ్రయం ఎగ్జిట్ గేట్ వద్ద రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అడ్డుకుని తనిఖీ చేయడంతో గుట్టురట్టయ్యింది. ఏకంగా ఆమె వద్ద 14.2 కిలోల బంగారం బయటపడింది. కమిషన్ కోసం కక్కుర్తిపడి గోల్డ్ స్మగ్లింగ్‌లో భాగస్వామ్యమైనట్టు తేలింది.

## శంకర్ గౌడ్ కుటుంబానికి రూ. కోటి ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి

### - బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు

పాలేరు ఏప్రిల్ 25(ప్రజా కలం న్యూస్ ) ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ఆర్థిక సహాయం సరిపోదని, శంకర్ గౌడ్ కుటుంబానికి కనీసం రూ.1 కోటి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆయన కోరారు. భవిష్యత్ లో కూడా ఆర్టీసీ కార్మికులు ఆందోళనకు గురికాకుండా, ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోకూడదని విజ్ఞప్తి చేశారు.



చర్చల ద్వారా శాశ్వత పరిష్కారం చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. మృతుడి కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం సానుభూతితో స్పందించి బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు. బీఎస్పీ నాయకత్వంలో శంకర్ గౌడ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

## అపరమేధావి డా. గుగ్గిళ్ల దివ్యమూర్తికి నేలకొండపల్లి బౌద్ధ స్తూపంలో ఘనంగా సన్మానం




పాలేరు ఏప్రిల్ 25( ప్రజా కలం న్యూస్)

నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డా. గుగ్గిళ్ల దివ్యమూర్తికి దక్షిణ భారతదేశంలో అతిపెద్ద బౌద్ధ క్షేత్రాలలో ఒకటైన నేలకొండపల్లి బౌద్ధ స్తూపంలో రిహాబ్లేషన్ ఆఫ్ గౌతమ చక్రవర్తి సొసైటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానం జరిగింది. రిహాబిలేషన్ ఆఫ్ గౌతమ చక్రవర్తి సొసైటీ వ్యవస్థాపకులు కట్టెకోల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ సన్మానం జరిగింది. గుగ్గిళ్ళ దివ్యమూర్తి ప్రతిభను చూసి ఈ సన్మానం చేస్తున్నట్లు కట్టెకోల వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ ఈ సన్మానం జరగడం తనకు సంతోషంగా ఉందని, ఇప్పటివరకు తనకు 140 వేదికల మీద సన్మానం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ విద్యాసేవా అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు, సామాజికవేత్త వడ్లమూడి శ్రీనివాసరావు, బద్రి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన కొల్లూరి దేవేందర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు

( వరంగల్/ పర్వతగిరి ) ఏప్రిల్ 25, ప్రజాకలం ప్రతినిధి.

వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కొల్లూరి దేవేందర్ ఇటీవల గడ్డి కట్టలు కట్టే యంత్రంలో చేయి వేళ్లు చిక్కుకుని తీవ్రంగా గాయపడగా, హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా విషయం తెలుసుకున్న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు శనివారం ఆస్పత్రికి వెళ్లి దేవేందర్‌ను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా



ఎమ్మెల్యే ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి దేవేందర్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పిన్నింటి అనిల్ రావుతో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ఈసీసీఈ డే' లో భాగంగా నూతన్ కుమార్ కి అన్న ప్రాసన్న కార్యక్రమం.

( వరంగల్/ పర్వతగిరి) ఏప్రిల్ 25, ప్రజాకలం ప్రతినిధి.

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దేవిలాల్ తండాలోని అంగన్వాడి సెంటర్లో అంగన్వాడి టీచర్ జాటోతు సుమిత్ర ఆధ్వర్యంలో లావుడియా ప్రవీణ్, సంధ్య దంపతుల కుమారుడు లావుడియా నూతన్ కుమార్ కి శనివారం ఈసీసీఈ డే సందర్భంగా అంగన్వాడి సెంటర్లో అన్నప్రాసన్న కార్యక్రమం నిర్వహించడం జరిగింది. చిన్నారులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ప్రోగ్రెస్ కార్డు ఇవ్వడం జరిగింది. చిన్నారులకు ఆరోగ్యవంతమైన ఆహారం అందిస్తూ, మంచి విద్యను అందిస్తూ, అలాగే ఇలాంటి చిన్న చిన్న కార్యక్రమాలను నిర్వహిస్తూ చిన్నపిల్లలను, వారి తల్లిదండ్రులను చైతన్య పరుస్తున్న అంగన్వాడి టీచర్ జాటోత్ సుమిత్రను తండా ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత..

## - డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ నర్సింగ్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 ప్రజాకలం : ఎల్లారెడ్డి పట్టణంలో శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖల, మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.




పట్టణంలోని కమ్యూనిటీ ఆసుపత్రి నుండి మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో 'నేటి తోక పురుగులే...రేపటి పెద్ద దోమలు... దోమలు పుట్టకుండా చేసుకుందాం... దోమలు కుట్టకుండా చేసుకుందాం...మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే... పరిసరాల పరిశుభ్రత... మనందరి బాధ్యత... వంటి నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ నర్సింగ్, మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ లు మాట్లాడుతూ.... ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని దీని ద్వారా దోమలు ఆవిర్భవించకుండా ఉంటాయన్నారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పార వేయడం వల్ల కూడా దోమలు తయారయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరు దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శరత్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఠాకూర్, ఆరోగ్య విస్తరణా అధికారులు గోవిందరెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు రాణి, రాజేశ్వరి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# హాజీపూర్ తండాలో దాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండాలో శనివారం ఎల్లారెడ్డి సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ రతన్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూచించారు.



దళారులకు తక్కువ ధరలకు అమ్మి నష్టపోకుండా జాగ్రత్త పడాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు తగతిన జరిగిన ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి కింటల్ కు రూపాయలు 2389, బి గ్రేడ్ ధాన్యానికి 2,369 రూపాయలు మద్దతు ధర ప్రభుత్వం తెలిపిందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎరుకల శివరాములు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రధానం....

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 ప్రజా కలం : తెలంగాణ సెర్ఫ్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు చెందిన డ్వాక్రా మహిళలకు గత 4 రోజులుగా స్కూల్ యూనిఫామ్స్ కటింగ్, స్టిచ్చింగ్ లో శిక్షణ అందజేసి, వారికి శనివారం సర్టిఫికెట్లను అందించినట్లు ఐకెపి ఎపిఎం రామనారాయణ గౌడ్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... టిజీ,ఏపీ యాప్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ సహకారంతో కోఆర్డినేటర్ సాయిలు, ట్రైనర్ విజయలక్ష్మి డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇవ్వడం జరిగింది అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 32 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేసినట్లు ఆయన తెలిపారు. అలాగే రెండో బ్యాచ్ శిక్షణ నిజాంసాగర్ మండలంలో సోమవారం నుండి నాలుగు రోజులు పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు, సిఆర్పిలు పాల్గొన్నారు.



# మెట్ పల్లి లో మే డే పోస్టర్ విడుదల



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజా కలం) అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలోని సహాయ కార్మిక శాఖ కార్యాలయం ముందు ఏఐటియూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎశమేని ఆధ్వర్యంలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మాట్లాడిన ఎశమేని గణేష్, ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం జరిగిన పోరాటాల ప్రతీకగా మేడేకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్మికుల కష్టానికి గౌరవం ఇవ్వాలని, వారి సంక్షేమానికి ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని, కార్మికులకు భద్రత, కనీస వేతనాలు, సామాజిక భద్రత అంశాల్లో నష్టం కలిగించే ప్రమాదం ఉందని విమర్శించారు. కార్యక్రమంలో పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ, మేడే సందేశం ప్రతి కార్మికుడికి చేరేలా చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. కార్మికుల ఐక్యతే వారి బలమని, హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మికసంఘ నాయకులు ఏఐటీయూసీ నాయకులు రామిల్ల రాంబాబు, ఎండి ఉస్మాన్, సమీర్, సెంట్రింగ్ యూనియన్ ప్రెసిడెంట్ గద్దల బాలరాజు, జలంధర్, నాగరాజు, మల్లాపూర్ రాజన్న తదితరులు పాల్గొన్నారు

# జనాభా లెక్కల నమోదుకు ప్రజలు సహకరించాలి

## - తాహాశీల్దార్ పుష్పలత

రుద్రంగి, ఏప్రిల్ 25, (ప్రజాకలం ప్రతినిధి)

దేశ వ్యాప్తంగా చేపడుతున్న జనాగణన జనాభా లెక్కల నమోదుకు ప్రజలు సహకరించాలని అలాగే స్వీయ గణన ద్వారా మీ పూర్తి సమాచారాన్ని ఆన్లైన్ చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల తాహాశీల్దార్ పుష్పలత కోరారు. ఆవే శనివారం ఎంఆర్వో కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. మన గ్రామం, మన రాష్ట్రం, మన దేశం, అభివృద్ధి చెందాలంటే ముందుగా జనాభా లెక్కల నమోదు కార్యక్రమం



విజయవంతంగా పూర్తి కావాలని దీనికి ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండి జనగణనకు సహకరించాలని కోరారు. దేశవ్యాప్తంగా చేపడుతున్న జనాభా లెక్కల నమోదుకు ప్రజలు సహకరించాలని, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు ఆన్లైన్ నమోదు కొనసాగుతుందని తెలిపారు. అలాగే స్వీయ గణన అనగా ఆన్లైన్ లో మీకు సంబందించిన పూర్తి వివరాలను https://se. census.gov.in అనే వెబ్సైట్ లో మిరే నమోదు చేసుకునే అవకాశం ఉందని అన్నారు. ఆన్లైన్ లో జన గణన నమోదు చేసుకోవడం ద్వారా సమయం ఆదా అవుతుందని అన్నారు.
మీ కుటుంబ/వివరాలు, ఫోన్ నంబర్, జిల్లా, పట్టణం, గ్రామం, పిన్ కోడ్ వివరాలతో పాటు మీ ఇంటి వివరాలు ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ ఉపయోగించాలని అలాగే ఇంటి వద్ద లొకేషన్ ఆన్ చేసి అ స్థలంలో రెడ్ మార్క్ చేసిన అనంతరం సడ్మిట్ చేయాలని ఆ తర్వాత మీకు ఒక ఐడి నంబర్ వస్తుందని మీ ఇంటికి వచ్చే గణన అధికారికి SE ID చూపిస్తే అప్రూవ్ చేస్తారని అన్నారు. దేశ జనాభా లెక్కలు అంటే వట్టి లెక్కలు కావని మన అభివృద్ధి కి పునాది, భవిష్యత్ కు బంగారు దారి అని అలాగే ప్రభుత్వ పథకాలు పక్కగా అమలు జరగాలంటే జనాభా లెక్కలు తప్పని సరని అన్నారు. జనాభా లెక్కల నమోదు వల్ల రేషన్ కార్డులు తొలగిపోతాయని ప్రభుత్వ పథకాలు రావనే భయభ్రాంతులకు గురి కావద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ అవగాహనతో జనాభా లెక్కల కార్యక్రమన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

# పోరాట స్పూర్తి శంకర్ గౌడ్..నీ త్యాగం అమరం

## - అమరజీవి కోల శంకర్ గౌడ్‌కు జిల్లా ఉద్యోగ జేఏసీ అశ్రునివాళి

పెద్దపల్లి, ఏప్రిల్ 25:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల హక్కుల సాధన పోరాటంలో అసువులు బాసిన కోల శంకర్ గౌడ్ త్యాగం చిరస్మరణీయమని పెద్దపల్లి జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ కొనియాడింది. శనివారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉద్యోగులందరూ ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఉద్యోగ లోకం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ చైర్మన్ మరియు టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు బొంకూరి శంకర్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పని చేసే తమకు, తోటి ఉద్యోగిని కోల్పోవడం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేసే ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాలని కోరారు. సమ్మెలు, పోరాటాల అవసరం లేకుండానే ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల భత్యాలను ఎప్పటికప్పుడు



విడుదల చేయాలని, అప్పుడే ఉద్యోగులు ఆత్మస్థైర్యంతో, మరింత స్ఫూర్తితో విధులను నిర్వర్తిస్తారని హితవు పలికారు. ఇలాంటి విషాదకర పరిస్థితులు తలెత్తి కుటుంబాలు వీధిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ నివాళి కార్యక్రమంలో జేఏసీ సెక్రటరీ జనరల్ తూము రవీందర్, ముఖ్య నాయకులు రంగారెడ్డి, కరుణాకర్, రవీంద్రనాథ్, రవీందర్, సాజిద్, రాజయ్య, రాజాప్రసాద్, అనిత, శిల్ప, ఉమాదేవి, ఉమపద్మజ, సురేష్, శ్యామ్, రాజమహేందర్, ప్రకాష్, రవి, అఖిల్, నిఖిల్, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి



## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,ఏప్రిల్ 25:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను ఖచ్చితంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. శనివారం అంతర్గాం తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, కార్యాలయ పనితీరును సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుతున్న సేవలు సమయానికి, పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మొగల్ పహాడ్ గ్రామ భూ సేకరణ ఎన్.టీ.పి.సి. అంశానికి సంబంధించి కొంతమంది రైతులు సమర్పించిన అభ్యంతరాలపై విచారణ చేసిన వివరములను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తూము రవీందర్ పాల్గొన్నారు. అనంతరం పెద్దపల్లి ఐటీఐ కళాశాలలో నిర్వహిస్తున్న ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి ఓటరికి సంబంధించిన ఆధారాలను తప్పనిసరిగా సేకరించాలని, మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనవసరంగా ఓటర్ల తొలగింపులు చేయరాదని స్పష్టం చేస్తూ, ప్రతి వివరాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను మే 30లోపు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఈ నెలాఖరులోగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ**

రామగుండం : రామగుండం జంగాలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఈ నెలాఖరులోగా లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం రామగుండం మండలంలోని జంగాలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను జిల్లా కలెక్టర్, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ అరుణశ్రీ తో కలిసి పరిశీలించి, అక్కడి మౌలిక వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇళ్ల వద్ద నీరు, విద్యుత్, రహదారులు తదితర ప్రాథమిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని స్పష్టం చేశారు. అనంతరం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాలపల్లి, పాములపేటలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రామగుండం మండలంలోని న్యూ మారేడుపాకలో ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిశించి, ఆ భూములను రెవెన్యూ శాఖకు కేటాయించి, ఆర్ అండ్ ఆర్ పట్టాలు మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో ఆర్.డి.ఓ. గంగయ్య, రామగుండం తహసీల్దార్ రవీందర్ రావు, తదితరులు, పాల్గొన్నారు.

# మెట్ల చిట్టాపూర్ పరిధిలోని గ్రామాల్లో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మెట్ పల్లి, రూరల్ ,ఏప్రిల్ 25:(ప్రజా కలం):

మెట్ పల్లి మండలంలోని మెట్ల చిట్టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి. ఎ. సి. యస్ ) పరిధిలో గల పలు గ్రామాల్లో శనివారం వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను ఘనంగా ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్, జిల్లా సహకార అధికారి (డి. సి. ఓ) మనోజ్ కుమార్, పి.ఐ.సి నిజాముద్దీన్ కలిసి విట్టంపేట్, రంగారావుపేట్, రామ లచ్చక్కపేట్, ఆత్మకూర్, జగ్గసాగర్, బండలింగాపూర్, రాజేశ్వరరావుపేట గ్రామాల్లో ఈ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కూన గోవర్ధన్ మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం బాగా ఎండబెట్టి, నాణ్యతా ప్రమాణాలను పాటించి కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం కల్పించే మద్దతు ధరను పూర్తిస్థాయిలో పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. అలాగే, కేంద్రాల నిర్వాహకులు ఎక్కడా రైతులకు ఇబ్బంది కలగకుండా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కోరుట్ల సీఐగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీనారాయణ




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజా కలం) ఇటీవల జరిగిన బదిలీల్లో కోరుట్ల సీఐ గా నియమితులైన లక్ష్మీనారాయణ శనివారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్లో పని చేస్తున్న ఎస్ఐలతో స్థానిక లాండ్ ఆర్డర్ పరిస్థితి పై సమీక్షించారు. కాగా ఇది వరకు పని చేసిన సురేష్ బాబు మెట్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నియమితులైంది విధితమే. బాధ్యతలు స్వీకరించిన సిఐ లక్ష్మీనారాయణ కు సురేష్ బాబు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్సీ కార్పోరేషన్ లబ్ధిదారులకు ఇంటర్వ్యూ

రుద్రంగి, ఏప్రిల్ 25, (ప్రజాకలం ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్సీల కార్పోరేషన్ కింద ఆన్ లైన్ లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు సోమవారం (తేది 27- 04 - 2026) రోజున ఉదయం 8 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించబడుతుందని ఎంపిడివో నటరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్ లైన్ లో పేర్లు నమోదు చేసుకున్న లబ్ధిదారులు తమ తమ ఒరిజినల్ పత్రాలతో హాజరు కావలని ఎంపిడీవో తెలిపారు.

# మలేరియా నివారణకు ప్రజల్లో చైతన్యం పెంపు

## - డాక్టర్. ఎల్లాల అంజిత్ రెడ్డి




మెట్ పల్లి: (కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాకలం)

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎల్లాల అంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ర్యాలీ ద్వారా మలేరియా నివారణకు సంబంధించిన సందేశాలను ప్రజలకు చేరవేశారు. అంజిత్ రెడ్డి మాట్లాడుతూ మలేరియా దోమల ద్వారా వ్యాపించే వ్యాధి కాబట్టి పరిసరాల్లో నీరు నిల్వ కాకుండా చూడటం చాలా ముఖ్యం అని తెలిపారు. దోమల కాటు నుండి రక్షణ పొందేందుకు మస్కిటో నెట్స్ వినియోగించడం, పూర్తిగా శరీరాన్ని కప్పే దుస్తులు ధరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే జ్వరం, వణుకు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొని మలేరియా నిర్మూలనకు తమ వంతు బాధ్యతగా సహకరించాలని సంకల్పించారు.

# అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాకలం) పట్టణంలోని 23వ వార్డు అంగన్వాడి కేంద్రంలో శనివారం నాడు పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు కౌన్సిలర్ కోయల్ కార్ స్రవంతి లింగేశ్వర్ మాట్లాడుతూ చిన్నారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. పిల్లల ఆహారం అలవాట్లను గమనించి సంపూర్ణ పోషక ఆహార విలువలతో కూడిన భోజనాన్ని అందించాలన్నారు. సూపర్వైజర్ ప్రతిభ, అంగన్వాడి టీచర్ సుజాత, వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ‘అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి’

**- అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎమ్మెల్యే కె.వి.ఆర్. పిలుపు**

**- నియోజకవర్గ అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ తో కలిసి సంయుక్త సమీక్ష...**

**- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదు : ఎమ్మెల్యే**

**- ఎమ్మెల్యే సూచనలను అధికారులు తప్పకుండా పాటించాలి : జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్**






కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 ప్రజాకలం : కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై స్థానిక శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ లు శనివారం సంయుక్తంగా ఆయా శాఖల అధికారులతో కలిసి కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అధికారులు, ప్రజాప్రతినిధులు నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇలా కలిసి పనిచేయడం వల్ల నియోజక వర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చు అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులకు ధాన్యం తడవకుండా టార్పాలీన్లు అందుబాటులో ఉంచాలని జిల్లా సహకార శాఖ అధికారి రామ్మోహన్ కు సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం మనందరి బాధ్యతని, పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు విస్తృతంగా పర్యటించి ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా చూడాలన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆయన సూచించారు. ఇక వేసవిలో కామారెడ్డి మున్సిపల్ తో పాటు నియోజకవర్గంలోని మండల కేంద్రాలు, గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులు ఆయన ఆదేశించారు. తాగునీటి సరఫరా లో లీకేజీలను అరికట్టి స్వచ్ఛమైన మంచినీరు ప్రజలకు అందించాలన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా ప్రజలకు మంచినీళ్లు సరఫరా చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీస్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో కలిసి పనిచేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే సూచనలను అన్ని శాఖల అధికారులు తప్పకుండా పాటిస్తూ, క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరించా లన్నారు. అంతేగాక ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా చూడాలన్నారు. అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేస్తే కామారెడ్డి జిల్లాను రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో మొదటి స్థానంలో ఉంచవచ్చని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, తహసిల్దారులు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు పాలెం వాసి మృతి

**మరో ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు...**

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ 25:

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామానికి చెందిన ఏనుగంటి గంగారం (63)ప్రమాదవశాత్తు మృతి చెందారు. మోర్తాడ్ మండల



ఎస్సై,బి. రాము కథనం మేరకు వివరాలు ఈ క్రింద విధంగా ఉన్నాయి. పాలెం గ్రామానికి చెందిన ఎనుగంటి గంగారం పని నిమిత్తం తిమ్మాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి పాలెం గ్రామానికి వస్తుండగా మార్గ మధ్యంలో తిమ్మాపూర్ గ్రామ శివారులో నేర కిషన్ అనే రైతుకు చెందిన వడ్ల కళ్ళం వద్ద టీ.ఎస్. ఓ. 2- యూ.ఏ.3588 నంబర్ గల లారీ యొక్క డ్రైవర్ కందరి జగన్ లారీని అజాగ్రత్తగా రివర్స్ చేస్తు రోడ్డుపైకి రావడంతో మోటార్ సైకిల్ పై వస్తున్న పాలెం గ్రామానికి చెందిన ఎనుగంటి గంగారం డి కొనడంతో చాతికి, ముక్కు కు బలమైన గాయాలు కావడంతో అక్కడే మరణించాడని ఎస్సై, బి. రాము తెలిపారు. మృతి చెందిన ఏనుగంటి గంగారం కుమారుడు ఏనుగంటి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కమ్మర్పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన ఆవారి సోమ పెద్ద బాజన్న, నడిపి బాజన్నలు ఉప్లూర్ గ్రామం నుండి ఆర్మూర్ వైపు వెళుతుండగా మార్గమధ్యంలో మోర్తాడ్ గ్రామ శివారులో గల జాతీయ రహదారి పై అశోక్ లేలాండ్ గూడ్స్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా వారు ఇరువురు గాయాల పాలయ్యారని, వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు మోర్తాడ్ మండల ఎస్సై, బి. రాము. తెలిపారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకై రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించినట్లు ఎస్సై, తెలిపారు.

# శివాజీ ఎవరు?

**పుస్తక ప్రచురణకర్తను ఎమ్మెల్యే బెదిరింపును ఖండించిన ముంబైకర్లు**

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ :

హేతువాది, దివంగత గోవింద్ పన్సారే రచించిన “శివాజీ ఎవరు?” పుస్తక ప్రచురణకర్త ప్రశాంత్ అంబికి అర్ధరాత్రి చేసిన ఫోన్ కాల్‌లో బూతులతో బెదిరించిన శివసేన పార్టీ (ఎక్నాథ్ షిండే) బుల్డాన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ ను




ముంబైకర్లు తీవ్రంగా ఖండించారు. శివాజీ ఎవరు? పుస్తకం 1988లో ప్రచురించబడింది. దాని శీర్షికలో మహారాజ్‌ను ఆయన మొదటి “శివాజీ” పేరుతో ప్రస్తావించడాన్ని గైక్వాడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అదేగాక “పన్సారే ఎక్కడికి వెళ్ళాడో అక్కడికి నిన్ను పంపిస్తాన”ని అంబిని హెచ్చరించారు. ఇట్టి ఘటన బుధవారం మధ్యరాత్రి 12.52 గంటలకు ప్రారంభమైన ఈ సంభాషణ 9నిమిషాల పాటు కొనసాగింది. ఈ డైలాగ్ లో గైక్వాడ్, అంబికి శారీరకంగా హాని చేస్తానని కూడా దమ్కీచ్చారు. ఐతే వారి మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ “ఆడియో క్లిప్” న్యూస్ ఛానెళ్లలో చక్కర్లు కొడుతున్నాయి. పరిణామం మహారాష్ట్రంతట నిరసనలు దావణంలగా వ్యాపించాయి. శుక్రవారం ముంబై పరేల్లో సంవిధాన్ జాగర్ సమితి ఆధ్వర్యంలో కార్యకర్తలు నిరసన వ్యక్తపర్చారు. సమితి కన్వీనర్లు సురేష్ సావంత్, ఉల్కా మహాజన్ మాట్లాడుతూ ఇట్టి విషయంపై హోంశాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, ఎమ్మెల్యే ఉపయోగించిన అసభ్య భాషను తీవ్రంగా పరిగణించి, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అట్టి పుస్తకాన్ని వేల సంఖ్యలో ప్రింట్ చేసి, ఇంటింటికీ పంచాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# కోర్టు భవన నిర్మాణ పనులపై జడ్జి శ్రీదేవి తనిఖీ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ 25:

నిజామాబాద్ జిల్లా భీంగల్ పట్టణంలో కొనసాగుతున్న కోర్టు భవన నిర్మాణ పనులను ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి శనివారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్న ఆమె, పనుల్లో నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె స్పష్టం చేశారు. కోర్టు భవనం అందుబాటులోకి వస్తే భీంగల్ పరిసర ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు మరింత సులభంగా అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక న్యాయవాదులు చైతన్య, సురేష్, ఎంపీడీవో సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.




# రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వరి ధాన్యం కొనుగోలు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం

**-ముత్యాల సునీల్ కుమార్**

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ 25:

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో వరి ధాన్యం సేకరణ విషయంలో రైస్ మిల్లర్ల నుండి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఏర్పడిన ఇబ్బందులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. త్వరలోనే కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేందుకు అవకాశముందని వెల్లడించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం సమస్యను సానుకూలంగా పరిశీలిస్తున్నదని పేర్కొన్నారు.



# రాష్ట్ర పండుగగా ‘వాసవి మాత జయంతి’ ని నిర్వహించాలి

**- ఆర్డీవో, తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్లకు జీవో కాపీల అందజేత..**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 ప్రజా కలం : ఆర్య వైశ్యుల ఆరాధ్య దేవత శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర పండుగగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 67 ప్రతులను శనివారం స్థానిక ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఆర్డిఓ ప్రభాకర్, తహసిల్దార్ ప్రేమ్ కుమార్, మున్సిపల్ మేనేజర్ వాసంతి లకు అందజేశారు. ఈ సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సిద్ది శ్రీధర్ గుప్తా మాట్లాడుతూ... వాసవి మాత జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగల జాబితాలో చేర్చిన నేపథ్యంలో అధికారికంగా జరపాలని ఆయా శాఖల అధికారులకు విజ్ఞప్తి చేశామన్నారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర పండుగ గా జరుపుతామని ప్రకటించారని తెలిపారు. ప్రతి ఏడు వైశాఖ శుక్ల పక్ష దశమి రోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర పండుగ జరపాలని జీవోలో పేర్కొన్నట్లు ఆయన అన్నారు. దీంతో ఆదివారం ఉదయం 6 గంటలకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత మందిరంలో అభిషేక కార్యక్రమం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ఆర్య వైశ్య బంధువులంతా ప్రత్యేక దుస్తులు ధరించి జంటలుగా దొరవారు హనుమాన్ మందిరం నుంచి కలశాలు, మంగళ హారతులతో పోచమ్మ గుడి వరకు ఊరేగింపుగా వెళ్తారని చెప్పారు. స్థానిక పోచమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10:30 గంటలకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఓడి బియ్యం, కుంకుమార్చనలు, అమ్మవారి చరిత్ర సామూహిక పారాయణం జరుగుతుందన్నారు .మధ్యాహ్నం ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన వితరణ ఉంటుంద న్నారు. సాయంత్రం 6:30 గంటలకు మంగళ హారతులు, దాండియా, అంత్యాక్షరి, పిల్లల సాంస్కృతిక నృత్యాలు, షోడపచార పూజలో నృత్యం తదితర కార్యక్రమాలు ఉంటాయ న్నారు. రాత్రి పవళింపు సేవ, అల్పాహారం ఉంటుందని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారునికి ఘన సన్మానం

**సీనియర్ జర్నలిస్ట్ ను సన్మానించిన దళిత, బిసి,మైనార్టీ నాయకులు...**



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)ఏప్రిల్ 25:

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మోర్తాడ్ జాతీయ రహదారి ప్రక్కనే గల పూలే విగ్రహం వద్ద శనివారం మోర్తాడ్ మండల దళిత సంక్షేమ సంఘం, బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు బండి నారాయణను దళిత సంక్షేమ సంఘం నాయకులు మల్లూరి రాజారాం, జాంబవ చామర్, మామిడి గంగాధర్, జర్నలిస్టు మామిడి రాజు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కుమ్మరి దశరథ్, ఎల్.ఐ.సి. వెంకటేష్, మైనార్టీ నాయకులు పాలెం నహీంలు తెలంగాణ ఉద్యమకారులైన, సీనియర్ జర్నలిస్ట్ బండి నారాయణకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా దళిత సంక్షేమ సంఘం నాయకులు, బీ.సీ. సంక్షేమ సంఘం నాయకులు పలువురు మాట్లాడుతూ, హైదరాబాద్ ఫ్రీ జోన్ కాదురా- హైదరాబాద్ మాదిరా అంటూ మోర్తాడ్ జాతీయరహదారి పక్కనే, దళిత, బిసి, అన్ని వర్గాలకు చెందిన పలువురు నాయకులతో కలిసి 14 రోజులపాటు ఉద్యమాన్ని చేపట్టడం జరిగిందని, అందులో బండి నారాయణ సైతం ఉద్యమానికి నిరంతరం కొనసాగిస్తూనే అన్ని విధాలుగా సహకరించారని వారన్నారు. అంతేగాకుండా తెలంగాణ తొలి విడత ఉద్యమంలో మోర్తాడ్ జాతీయ రహదారి పక్కనే టెంటు వేసుకుని, దళిత, బడుగు, బలహీన, మైనార్టీ, అన్ని పార్టీ నాయకులతో కలిసి తెలంగాణ రాష్ట్ర సాధనకై అందరితో కలిసి ఒకపక్క ఉద్యమం చేస్తూ, మరోపక్క జర్నలిస్టుగా ఉద్యమ వార్తలను అన్ని పత్రికలకు అందిస్తూ ఎంతో సేవ చేశారని, ఆయన జీవితాన్ని ఉద్యమంలో ఎంతో నష్టం పోయినప్పటికీ నిరంతరం ఉద్యమాన్ని కొనసాగించడం జరిగిందని వారన్నారు. జర్నలిస్టుగా, జర్నలిస్టు ఫోటోగ్రాఫర్ గా, ఉద్యమం చేస్తూనే, అన్ని పత్రికలకు ఫోటోలు అందిస్తూ కృషి చేశారని వారన్నారు. పత్రిక జర్నలిస్టుగా 30 ఏళ్ల నుండి పార్టీలకతీతంగా, రాజకీయాలకు అతీతంగా, అన్ని వర్గాల ప్రజల సాధక, బాధకాలలో నూ, గ్రామాలలో అభివృద్ధికి, గ్రామాలలోని ప్రజల సమస్యలను, అధికారులకు, నాయకులకు భయపడకుండా ఎంతోమంది నిరుపేదల సమస్యలను వార్త కథనాలు రాస్తూ వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేసే వారిని వారు పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా జర్నలిస్టుగా, తెలంగాణ ఉద్యమం కారునిగా, హైదరాబాద్ ఫ్రీ జోన్ కు వ్యతిరేకంగా ఉద్యమించిన, గ్రామ అభివృద్ధి కమిటీలు, పోలీస్ అధికారులు, వివిధశాఖల అధికారులు, పాలు కుల సంఘాల సభ్యులు బెదిరింపులకు పాల్పడ్డ, తప్పుడు ప్రచారాలు చేసిన అవేమీ పట్టించుకోకుండా తనదైన శైలిలో వార్తలు వాస్తవాలు వాస్తు అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ అండగా నిలిచే ఏకైక జర్నలిస్టుగా పేరుందిన బండి నారా యణ అనే సీనియర్ జర్నలిస్టును ఎవరు గుర్తించిన, గుర్తించక పోయినా, ఇప్పటికీ అదే బాటలో కొనసాగుతుండడం, తెలంగాణ ఉద్యమకారునిగా, హైదరాబాద్ ఫ్రీ జోన్ మీది కాదురా మాదిరా అంటూ వ్యతిరేకంగా మా తోటి ఉద్యమాలు కొనసాగిస్తూనే, తెలంగాణ ఉద్యమంలోనూ తమతో నిరంతరం 14 ఏళ్ల పాటు ఉద్యమంలో తమతో పాటు కృషి చేయడం పట్ల, దీంతో తాము ఆయన చేస్తున్న సేవలను, ఉద్యమాలను గుర్తించి సన్మానించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమకారులు బండి నారాయణ మాట్లాడుతూ, తనకు నిరుపేదలైన మండల దళిత సంఘాల నాయకులు, బి.సి, సంఘాల నాయకులు సన్మానించడం పట్ల మరింత బాధ్యతను పెంచారని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల మేరకు, ఎవరు ఎన్ని అపార్థాలు చేసిన, ఎన్ని శాఖల అధికారులు వేధించిన, బెదిరించిన, ఒకవేళ కేసులు సైతం నమోదు చేసిన తాను ప్రధానంగా నిరుపేదల సమస్యలపై, అవినీతి, అక్రమాలపై, గ్రామాలలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలపై ధైర్యంగా మరింత కథనాలు రాస్తూ ప్రజలకు అండగా నిలుస్తారని సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమకారులు బండి నారాయణ పేర్కొన్నారు. తనను సన్మానించిన దళిత మండల నాయకులకు, బిసి సంఘం నాయకులకు, మైనార్టీ నాయకులకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

# గ్లామర్ డోస్ పెంచేసిన కృతి సనన్..



అసలే సమ్మర్.. సూర్య భగవానుడి భగభగ మంటలకు ప్రజలు అల్లాడిపోతుంటే .. హీరోయిన్లు కూడా ఆ వేడిని మరింత పెంచడానికి సెగలు పుట్టించేలా ఔట్ ఫిట్స్ ధరిస్తూ సోషల్ మీడియా వేదికగా అందాలు ఆరబోస్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు.. ఒకరి తర్వాత ఒకరు.. ఒకరితో ఒకరు పోటీపడుతూ గ్లామర్ విందు వడ్డిస్తూ అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు . ఇక సోషల్ మీడియా వాడకం ఎప్పుడైతే పెరిగిపోయిందో అటు చిన్న పిల్లల్ని మొదలుకొని పెద్దవాళ్ల వరకు ప్రతి ఒక్కరు మొబైల్ ఫోన్ లేనిదే గడవని రోజులు . అలాంటి ఈ సమయంలో హీరోయిన్స్ కూడా తమ అందాలను ఎరగా వేసి క్యాష్ చేసుకుంటున్నారు అనే వార్తలు ఎప్పటికప్పుడు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే అలా అందాలతో మరింత హీట్ పెంచుతూ బ్లాక్ అవుట్ ఫిట్ లో సెగలు పుట్టించే ప్రయత్నం చేసింది కృతి సనన్. విభిన్నమైన ఫోజులు ఇస్తూ సెగలు పుట్టించేలా ఫోటోలకు పంచుకుంది. బ్లాక్ అవుట్ ఫిట్ లో కృతి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. లెదర్ మెటీరియల్ ను తలపించేలా బ్లాక్ డ్రెస్ ధరించిన ఈమె తన అవుట్ ఫిట్ ను మరింత అందంగా మార్చుకుంది. హుందాగా ఫోటోలకు ఫోజులిస్తూ మెస్మరైజ్ చేసింది. మరికొన్ని ఫోటోలలో రొమాంటిక్ గా ఫోజులిస్తూ నెటిజన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అలా మొత్తానికైతే కృతి తాజాగా షేర్ చేసిన ఈ లేటెస్ట్ ఫోటోషూట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇండస్ట్రీలోకి రాకముందు పెద్ద పెద్ద కంపెనీల కమర్షియల్ యాడ్స్ లలో నటించిన ఈమె.. తొలిసారి తెలుగులో మహేష్ బాబు హీరోగా వచ్చిన 1: నేనొక్కడినే అనే సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసింది. ప్రముఖ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను 14 రీల్స్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని అందించారు.

# పెద్ది.. ఆ డేట్ వెనుక ఎన్నో ఆలోచనలు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్లో వస్తున్న 'పెద్ది' చిత్రంపై అంచనాలు భారీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ మొదలైనప్పటి నుండి రిలీజ్ డేట్ విషయంలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మొదట జూన్ 4న సినిమా వస్తుందని ప్రచారం జరిగినా, లేటెస్ట్ గా అందుతున్న సమాచారం ప్రకారం మేకర్స్ మరో డేట్‌ను ఖరారు చేశారు. కేవలం సెంటిమెంట్ కోసం కాకుండా, పక్కా బిజినెస్ లెక్కలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ డేట్ మార్పు వెనుక ఉన్న అసలు కారణాలు ఇప్పుడు ఫిల్మ్ నగర్ లో ఆసక్తికరంగా మారాయి. అసలు విషయం ఏంటంటే, 'పెద్ది' సినిమాను జూన్ 25న విడుదల చేయడానికి చిత్ర బృందం మొగ్గు చూపుతోంది. జూన్ మొదటి వారంలో స్కూళ్లు రీఓపెన్ అయ్యే హడావిడి ఉండటంతో ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు రావడం కష్టమని భావించి జూన్ 4 ఆప్షన్‌ను పక్కన పెట్టారు. అదే 25వ తేదీ అయితే నెలాఖరు కావడంతో పాటు శాలరీలు పడే టైమ్, దీనివల్ల ఓపెనింగ్స్‌కు ప్లస్ అవుతుంది. అంతేకాకుండా యూఎస్ మార్కెట్‌లో జూలై వీకెండ్ అడ్వాంటేజ్ కూడా ఈ సినిమాకు కలిసి వస్తుంది. ఓవర్సీస్ వసూళ్లపై కన్నేసిన చరణ్ టీమ్, ఈ లాంగ్ రన్ స్ట్రాటజీతోనే జూన్ 25ను లాక్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే 90 శాతం చిత్రీకరణ పూర్తవ్వగా, మే మొదటి వారంలో శ్రుతి హాసన్‌తో ఒక స్పెషల్ ఐటెం సాంగ్ షూట్ చేయబోతున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం మరో విశేషం. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ కథ బి, సి సెంటర్ల ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని మేకర్స్ నమ్ముతున్నారు. ల్ అందుకే ప్రమోషన్లకు కూడా తగినంత సమయం దొరికేలా జూన్ నెలాఖరును ఎంచుకున్నారు. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్టును నిర్మిస్తున్నాయి. రామ్ చరణ్‌కు 'ఆర్ఆర్ఆర్' తర్వాత గ్లోబల్ మార్కెట్ పెరిగినప్పటికీ, సోలో హీరోగా తన బాక్సాఫీస్ స్టామినాను నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది.బుచ్చిబాబు తన మార్క్ సెన్సిబిలిటీస్‌తో ఈ కథను చాలా ఇంటెన్సివ్‌గా తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. రెహమాన్ ఇచ్చే మ్యూజిక్, సినిమాలో ఉండే ఎమోషనల్ సీన్లు ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని ఇస్తాయని టాక్. డిస్ట్రిబ్యూటర్లకు కూడా జూన్ 25 సేఫ్ డేట్ అని అనిపించడంతో,అందరూ ఈ డేట్‌కే ఓటు వేశారు. త్వరలోనే దీనిపై ఒక అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.మొత్తానికి 'పెద్ది' రిలీజ్ విషయంలో మేకర్స్ చాలా తెలివిగా అడుగులు వేస్తున్నారు. కేవలం హడావిడిగా సినిమాను థియేటర్లలోకి తీసుకురాకుండా, వసూళ్లు వచ్చే అవకాశం ఉన్న సమయాన్ని ఎంచుకున్నారు. షూటింగ్ పూర్తి చేసుకుని ప్యాచ్ వర్క్ కూడా ఫినిష్ చేస్తే, జూన్ లో చరణ్ మాస్ హడావుడి మొదలవ్వడం ఖాయం.

# బాలి బీచ్‌లో సిమ్రత్ కౌర్.. ఫ్యాన్స్ ఫిదా



బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ సిమ్రత్ కౌర్ రంధావా. 'డర్టీ హరి' చిత్రంతో కుర్రకారు గుండెల్లో సెగలు పుట్టించిన ఈ పంజాబీ ముద్దుగుమ్మ, సోషల్ మీడియాలోనూ అంతే చురుగ్గా ఉంటోంది. తాజాగా బాలి వెకేషన్‌లో ఆమె షేర్ చేసిన బీచ్ ఫోటోలు నెట్టింట మంటలు పుట్టిస్తున్నాయి. రంగురంగుల బికినీలో, సముద్రపు అలల మధ్య సిమ్రత్ మెరిసిపోతున్న తీరు చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఆ ఆసక్తికరమైన వివరాలు మీకోసం. ముంబైలోని ఒక పంజాబీ కుటుంబంలో పుట్టి పెరిగిన సిమ్రత్ కౌర్, 2017లో 'ప్రేమతో మీ కార్తీక్' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత 'పరిచయం' వంటి సినిమాల్లో నటించినా, 'డర్టీ హరి' సినిమాతోనే ఈ అమ్మడు పాపులారిటీ అమాంతం పెరిగిపోయింది. తన గ్లామర్‌తో యూత్‌ను కట్టిపడేసిన సిమ్రత్, గతేడాది బాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'గదర్ 2'లో సన్నీ డియోల్ కోడలిగా నటించి నేషనల్ వైడ్ గుర్తింపు తెచ్చుకుంది. బంగార్రాజులో అతిథి పాత్రలో మెరిసినా, ఏ సినిమాలో ఉన్నా తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ప్రస్తుతం షూటింగుల నుంచి గ్యాప్ తీసుకున్న సిమ్రత్, బాలిలోని అందమైన 'మెలాస్టి బీచ్' లో ఎంజాయ్ చేస్తోంది. ఈ వెకేషన్‌కు సంబంధించిన కొన్ని ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయగా, అవి కాస్తా వైరల్‌గా మారాయి. మల్టీ-కలర్ ఫ్లోరల్ బికినీ సెట్‌తో పాటు మ్యాచింగ్ మినీ సరాంగ్ ధరించి సిమ్రత్ అప్సరసలా కనిపిస్తోంది. సముద్రపు తీరంలో తడిచిన అందాలతో, చిలిపి నవ్వులతో ఆమె ఇస్తున్న పోజులు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. సిమ్రత్ కౌర్ కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, తన కళ్లతోనే కవితలు చెప్పగలదు. ఆమె కళ్లు, మనోహరమైన నవ్వు కుర్రకారును మాయ చేస్తున్నాయి. ఈ త్రీ-పీస్ స్విమ్ సెట్‌లో ఆమె బాడీ లాంగ్వేజ్ మరియు కాన్ఫిడెన్స్ ఆ డ్రెస్‌కు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. ఇక ఫ్లోరల్ డిజైన్ ఉన్న ఈ హాల్టర్ బీచ్ డ్రెస్ ఆమె స్కిన్ టోన్‌కి పర్ఫెక్ట్‌గా సెట్ అయింది. ఫోటోలు చూసిన వారంతా "బ్యూటీ ఇన్ బాలి" అంటూ కామెంట్లతో సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నారు. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే సిమ్రత్, తన లేటెస్ట్ ఫోటో షూట్లతో ఎప్పటికప్పుడు ఫాలోవర్లను పెంచుకుంటోంది. ఈ బాలి ట్రిప్ ఫోటోలు చూస్తుంటే ఆమె తన వ్యక్తిగత సమయాన్ని ఎంతలా ఆస్వాదిస్తుందో అర్థమవుతోంది. ఒక్కో ఫోటోకు లక్షల్లో లైకులు వస్తుండటం ఆమె క్రేజ్‌ను తెలియజేస్తోంది.

# 100 కోట్లకు దగ్గరగా త్రిష ప్లానింగ్



గత కొంతకాలంగా సీనియర్ హీరోయిన్స్ కు డిమాండ్ పెరుగుతోంది. ఐదేళ్ల క్రితం వరకు 30 దాటితే సపోర్టింగ్ రోల్స్ తో సర్దుకునే వారు. కానీ ప్రస్తుతం సీనియర్ భామలు 40కి దగ్గరవుతున్నా క్యారెక్టర్ కు తగ్గట్టుగా హీరోలకు జోడిగా కొనసాగుతున్నారు. ఆ లిస్టులో నయన్, త్రిష క్రేజే వేరు. ముఖ్యంగా ఇప్పుడు త్రిషకు ఉన్న డిమాండ్ మామూలుగా లేదు. హీరోయిన్‌గా రెండు దశాబ్దాలు దాటినా రెమ్యునరేషన్ తగ్గలేదు, డిమాండ్ ఆగలేదు. పైగా ఏజ్ పెరిగే కొద్దీ బ్యాంక్ బ్యాంక్ బ్యాలెన్స్ పెరుగుతోంది. లేటెస్ట్ గా త్రిష కృష్ణన్ నెట్ వర్త్ 85 కోట్లు దాటిందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇంకో రెండు సినిమాలు హిట్ అయితే 100 కోట్ల క్లబ్‌లోకి వెళ్లిపోతుందని తెలుస్తోంది. మరి ఈ 'సైలెంట్ సక్సెస్' వెనక అసలు ఫార్ములా ఏంటి అనే వివరాల్లోకి వెళితే.. 1999లో 'జోడి'తో ఎంట్రీ ఇచ్చినప్పుడు ఎవరూ ఊహించి ఉండరు, ఈ అమ్మాయి 2026లో కూడా కోట్లు తీసుకుంటూ లీడ్ రోల్స్ చేస్తుందని. వర్షం, ఘిల్లితో స్టార్ హీరోయిన్ గా మంచి క్రేజ్ అందుకుంది. మధ్య మధ్యలో అలా సక్సెస్ చూసిన అమ్మడు హీరోయిన్ గా ఇక కష్టమే అనుకుంటున్న సమయంలో 96తో క్లాస్ ఆడియన్స్‌ని పట్టేసింది. కెరీర్‌లో గ్యాప్ వచ్చిన ప్రతిసారీ 'విన్నైతాండి వరువాయా', 'పొన్నియిన్ సెల్వన్' లాంటి సినిమాతో బౌన్స్ బ్యాక్ అయింది. అంటే ప్రతి ఐదేళ్లకు ఒకసారి తన మార్కెట్‌ని తనే రీసెట్ చేసుకుంటూ వచ్చింది. అందుకే 25 ఏళ్ల తర్వాత కూడా రేసులో ఉంది. ఇప్పుడు త్రిష ఒక్కో ప్రాజెక్ట్‌కి 10 కోట్ల రేంజ్ లో రెమ్యునరేషన్ తీసుకుంటోందని ఇండస్ట్రీ టాక్. లియోకి 5 కోట్లు రెమ్యునరేషన్ దక్కినట్లు గతంలో టాక్ వచ్చింది. అలాగే సినిమాలతో పాటు బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ మరో బిగ్ ఇన్‌కమ్. ఏడాదికి దాదాపు 9 కోట్లు యాడ్స్ నుంచే వస్తున్నాయట. ఇక్కడే త్రిష తెలివి కనిపిస్తుంది. కేవలం స్కిన్ కేర్, బ్యూటీ బ్రాండ్స్ కాకుండా ఫైనాన్స్, జ్యువెలరీ, రియల్ ఎస్టేట్ కంపెనీలకు కూడా బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంది. 40 ప్లస్ ఏజ్‌ని లయబిలిటీ కాకుండా అసెట్‌గా మార్చుకుంది. అందుకే బ్రాండ్స్ ఇప్పటికీ ఆమెనే నమ్ముతున్నాయి. సంపాదన ఎంత ముఖ్యమో, దాన్ని ఎక్కడ పెట్టాలో తెలియడం అంతకంటే ముఖ్యం. త్రిష ఆ విషయంలో పక్కా ప్లానింగ్‌తో ఉంది. చెన్నైలో 10 కోట్లకు పైగా విలువ చేసే ఇల్లు ఉందట. అలాగే హైదరాబాద్‌లో కూడా 6 కోట్ల ప్రాపర్టీ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. 15 ఏళ్ల క్రితం కొన్న స్థలాలు ఇప్పుడు మూడు రెట్లు అయ్యాయి. మెర్సిడెస్, బీఎండబ్ల్యూ కార్స్ కలెక్షన్ తో ఆమె లెక్క 4 కోట్లు. ఇవన్నీ కేవలం షో కోసం కాదు. స్టార్ ఇమేజ్‌ని కాపాడుకుంటూనే లాంగ్ టర్మ్ వెల్త్ క్రియేట్ చేసుకునే మార్గాలని చెప్పవచ్చు. సినిమా ఫీజుని నేరుగా ల్యాండ్‌లోకి మళ్లించడం వల్లే నెట్ వర్త్ స్టడీగా పెరిగింది. హిట్స్ ఉన్నప్పుడు దాచుకోవడం, ఫ్లాప్స్ వచ్చినప్పుడు ప్యానిక్ కాకపోవడం, ట్రెండ్ మారిన ప్రతిసారీ తనని తాను మార్చుకోవడంతో అమ్మడు ఇంతకాలం ఇండస్ట్రీలో నిలబడింది అని చెప్పవచ్చు. అందుకే 1999 బ్యాచ్ హీరోయిన్స్ అందరూ సైడ్ అయిపోయినా, త్రిష మాత్రం 100 కోట్ల మార్క్‌కి దగ్గరగా వచ్చింది. స్టార్‌డమ్ టెంపరరీ, కానీ స్మార్ట్ ప్లానింగ్ పర్మనెంట్ అని ప్రూవ్ చేసింది. ఇక ఈ స్టార్ హోదాను అమ్మడు ఇంకా ఎంత కాలం కొనసాగిస్తుందో చూడాలి.

# గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా ప్లానింగ్!



గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా వృత్తిగత- వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేయడంలో మిసెస్ పర్ఫెక్ట్. ప్రస్తుతం పీసీ చేతిలో హాలీవుడ్ - టాలీవుడ్ చిత్రాలకు సంబంధించిన భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ఓవైపు వెస్టన్ మీడియాలో టాప్ పొజిషన్‌లో ఉంటూనే మరోవైపు భారతీయ చిత్రాలపైనా దృష్టి పెట్టి పని చేస్తోంది. ఈ క్రమంలో పీసీ ప్లానింగ్ - టైమ్ మేనేజ్‌మెంట్ సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ సిటాడెల్ రెండో సీజన్ షూటింగ్‌లో ప్రియాంక బిజీగా ఉంది. యాక్షన్ ప్యాక్డ్ స్పై థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ సిరీస్ కోసం అమ్మడు ఎంతో శ్రమిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న ఇలాంటి భారీ ప్రాజెక్టును హ్యాండిల్ చేస్తూనే టాలీవుడ్ లో ప్రతిష్టాత్మకంగా రాజమౌళి రూపొందిస్తోన్న గ్లోబల్ మూవీ వారణాసి కోసం కూడా పీసీ సమయాన్ని కేటాయిస్తోంది. రెండు భిన్నమైన సినీ పరిశ్రమలను బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకెళ్లడం అంత సులభం కాదు. ఎంతో ప్లానింగ్ ఉంటే తప్ప సాధ్యం కాదు. అలాగే ప్రియాంక చోప్రా కేవలం నటనకే పరిమితం కాకుండా కుటుంబానికి కూడా అత్యంత ప్రాధాన్యతనిస్తారు. భర్త నిక్ జోనాస్ , కుమార్తె మాల్టీ మేరీతో గడిపే ప్రతి క్షణాన్ని ఆమె ఎంతో విలువైనదిగా భావిస్తుంది. షూటింగ్ షెడ్యూల్స్ ఎంత బిజీగా ఉన్నా? కుమార్తె ఎదుగుదలలో ఏలాంటి పొరపాట్లు జరగకుండా ఎంతో జాగ్రత్తగాచూసుకుంటుంది. షూటింగ్ స్పాట్స్‌కు కూడా అప్పుడప్పుడు మాల్టీని తీసుకెళ్లుంది. ఒక తల్లిగా తన బాధ్యతలను సక్రమంగా వంద శాతం నెరవర్తిస్తుంది. అంతర్జాతీయ ఈవెంట్స్, రెడ్ కార్పెట్ అప్పీరెన్స్ , బ్రాండ్ ప్రమోషన్ల కోసం ప్రియాంక ప్రపంచవ్యాప్తంగా ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. అయినా నిక్ జోనాస్‌తో ఆమెకు ఉన్న అవగాహన ,పర్ఫెక్ట్ టైమ్ మేనేజ్‌మెంట్ వల్ల వారి మధ్య ఎటువంటి ఇబ్బందులు రావడం లేదు. నిక్ మ్యూజిక్ టూర్స్, ప్రియాంక షూటింగ్స్ మధ్య వారు ఒకరికొకరు మద్దతుగా నిలుస్తూ పవర్ కపుల్ అనిపించుకుంటున్నారు. ఇంత బిజీలోనూ పీసీ ఫ్యామిలీ వెకేషన్ల కోసం ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించడం విశేషం. -వారణాసి- విషయానికి వస్తే ఈ సినిమాపై భారతీయ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. మహేష్ - రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో ప్రియాంక పాత్ర ఎంతో కీలకంగా ఉండబోతోంది. గ్లోబల్ లెవల్ గుర్తింపు ఉన్న ప్రియాంక ఈ ప్రాజెక్టులో భాగమవ్వడంతో సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో భారీ హైప్ వస్తోంది. తన షూటింగ్ డేట్స్ ఎక్కడా క్లాష్ అవ్వకుండా ఆమె టీమ్ ఎంతో జాగ్రత్తగా ప్లాన్ చేస్తోంది.

## దళారుల వద్ద రైతులు నకిలీ విత్తనాలు కొనవద్దు.

# నకిలీకి అడ్డుకట్ట.. రైతుకు భరోసా!

### -విత్తన 'నాణ్యత'పైనే సర్కారు దృష్టి
### -విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి.




సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజా కలం): సంగారెడ్డి రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో వ్యవసాయశాఖ అధికారులు, విత్తన డీలర్లు, సహకార సంఘాలు, ఎఫ్పీఓల ప్రతినిధులతో నిర్వహించిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ "యదా బీజం తదా సస్యం" అనే సూత్రాన్ని ప్రస్తావిస్తూ నాణ్యమైన విత్తనాల ప్రాముఖ్యతను వివరించారు. జిల్లాలో పత్తి, వరి, జొన్న, సోయాబీన్, కందులు, మినుములు వంటి పంటలు సాగవుతున్నందున రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో కల్తీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ పరిస్థితుల్లో వారిని నాణ్యమైన విత్తనాల వినియోగం వైపు మళ్లించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్వేష్ రెడ్డి అన్నారు. వరి సాగుపైనే కాకుండా, రైతులు లాభదాయకమైన ఇతర పంటల వైపు మొగ్గు చూపాలని చైర్మన్ సూచించారు. వరికి ప్రత్యామ్నాయంగా పెసర, కంది, మినుము, శనగ, వేరుశనగ, నువ్వులు వంటి పంటలను సాగు చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు.

విత్తనాభివృద్ధి సంస్థ నేరుగా, రైతులతో అనుసంధానమై విత్తన ఉత్పత్తి చేపడుతుందని, కఠినమైన ప్రమాణ పరీక్షల తర్వాతే వాటిని ధృవీకరించి రైతులకు అందజేస్తున్నామని భరోసా ఇచ్చారు. వానకాలం సీజన్కు సిద్ధం- ప్రస్తుత ఖరీఫ్ సీజన్కు సంబంధించి జిల్లాల్లో విత్తనాల కొరత లేదని ఆయన వెల్లడించారు. సన్న రకాలు బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638 అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే దొడ్డు రకాలు కెఎన్ఎం 118, ఎమ్టియు 1010 కూడా రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.ప్రభుత్వం సూచించిన ఈ రకాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని, విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను ప్రతి విత్తన డీలర్ అమ్మాలని కోరారు. అలాగే పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను సకాలంలో అందజేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వం సూచించిన ఈ రకాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని, విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను ప్రతి విత్తన డీలర్ అమ్మాలని కోరారు. అలాగే పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను సకాలంలో అందజేస్తామని పేర్కొన్నారు.

ఈ వానకాలంలో సుమారు 1.57 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని, ఇందుకు 40 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమని అంచనా వేశారు. ఇందులో కనీసం 20 వేల క్వింటాళ్లను విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా సరఫరా చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలో రాబోయే నూతన విత్తన చట్టం రైతుల హక్కులతో పాటు డీలర్ల ప్రయోజనాలను కూడా కాపాడుతుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు

జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ కె. శివప్రసాద్ మాట్లాడుతూ డీలర్లు నకిలీ విత్తనాలను విక్రయించకూడదని, ప్రైవేట్ కంపెనీల ప్రలోభాలకు లోనై రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు కృత్రిమ కొరత సృష్టించరాదని, గరిష్ట చిల్లర ధర ఎంఆర్పి కంటే ఎక్కువకు అమ్మకాలు జరపరాదని సూచించారు.

విత్తనాలు, ఎరువులు మరియు పురుగుమందుల డీలర్లు ప్రతి నెల 5వ తేదీ లోగా మండల వ్యవసాయ అధికారి/ఏడీఏ/డీఏఓ/సిడడీఏ కార్యాలయాలకు స్టాక్ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో టాస్క్ ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేయబడ్డాయని, ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో హెచ్టీ పత్తి విత్తనాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మె 4 నుండి 9 వరకు నిర్వహించే ఫార్మర్స్ వీక్ సందర్భంగా రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు తప్పనిసరిగా లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేసి, సరైన లేబులింగ్ మరియు ధృవీకరణ కలిగిన విత్తనాలను మాత్రమే వినియోగించాలని సూచించారు.

డీఎస్పీ సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 8712656777 కు కాల్ చేయాలని సూచించారు. సమాచారాన్ని అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, నకిలీ విత్తనాల విక్రయంపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ ద్వారా ఇప్పటికే డీలర్లకు సీడ్ యాక్ట్ మరియు ఎరువుల చట్టాలపై శిక్షణలు నిర్వహించినట్లు, నకిలీ విత్తనాల విక్రయం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ సమావేశంలో డీసీఓ , కిరణ్ కుమార్, డీహెచ్ఎస్ఓ సోమేశ్వర్, డీఎస్పీ సత్తయ్య గౌడ్, ఎస్బీ ఇన్స్పెక్టర్, మార్క్ ఫెడ్ డీఎం, టీజీ సీడ్స్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ శర్మ, టీఎస్ఎస్ఓసీ రీజినల్ మేనేజర్ అతుల్ కుమార్ జైన్, వ్యవసాయ శాఖ ఏడీఏలు, ఏఓలు, పీఏసీఎస్ సీఈఓలు, విత్తనాలు మరియు ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

# టిపిసిసి లీగల్ సెల్ స్టేట్ కన్వీనర్ గా ఉత్తమ్ ఠాకూర్

మల్కాజిగిరి,ఏప్రిల్25(ప్రజా కలం ప్రతినిధి)



మల్కాజిగిరి నియోజకవర్గానికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఉత్తమ్ ఠాకూర్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ (టి పి సి సి) లీగల్ సెల్ స్టేట్ కన్వీనర్ గా నియమితులయ్యారు. నియామక పత్రాన్ని టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ వద్దనుండి శనివారం గాంధీభవన్ లో పొందినట్లు ఉత్తం ఠాకూర్ పేర్కొన్నారు. ఈ పదవి రావా కావడానికి అవకాశం కల్పించిన మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు,మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ లతో పాటు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, లీగల్ సెల్ విభాగానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను అని చెప్పారు.

# ఎమ్మెల్యే జిఎంఆర్ ను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్ రెడ్డి

పటాన్ చేరు ఏప్రిల్ 25 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్చెరు ఇటీవల తన కార్యాలయంలో జారిపడి, స్వల్ప గాయాలకు గురై తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ని



శనివారం సాయంత్రం మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు తన సహచర ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్ లతో కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ... పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధి కోసం అనునిత్యం తపనపడే ఎమ్మెల్యే జిఎంఆర్ త్వరగా కోలుకొని.. ప్రజా సేవలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్, పాండురంగా రెడ్డి, విజయ్ కుమార్, అంజయ్య, శ్రీకాంత్ గౌడ్, వెంకటేష్ గౌడ్, సుప్రజా వెంకట్ రెడ్డి. గూడెం మధుసూదన్ రెడ్డి, పరమేష్ యాదవ్, అంతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు



# వీరారెడ్డిపల్లిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి.

### ఏఈ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేత.

సిద్దిపేట ప్రజాకలం ఏప్రిల్ 25.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావుకు గ్రామ సర్పంచ్ రొయ్యల సుగుణ శ్రీనివాస్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో గత 25 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రస్తుతం శిధిలావస్థకు చేరుకున్నాయని, ప్రమాదాలు సంభవించే అవకాశమున్నందున పాత స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే వదులుగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేసి గ్రామంలో నెలకొన్న తక్కువ వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఏఈ శ్రీనివాసరావు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు బయోపిక్ అడుగులు



విజయవాడ : తెలుగు రాజకీయ నేతల బయోపిక్ లు మంచి ఆదరణ పొందాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి బయోపిక్ యాత్ర సినిమా ద్వారా తెరకెక్కించారు. విశేష ప్రేక్షకాదరణ పొందింది ఆ చిత్రం. ఎన్టీఆర్ కథానాయకుడు, నాయకుడు పేరిట బయోపిక్ వచ్చింది. ఆయన కుమారుడు నందమూరి బాలకృష్ణ ఎన్టీఆర్ పాత్రలో మెప్పించారు. అయితే ఇప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు బయోపిక్ రానుంది. చంద్రబాబు జీవితంలోని ముఖ్యమైన సంఘటనల ఆధారంగా ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ మేరకు దర్శకుడు భానుశంకర్ ప్రకటన చేశారు. రాజధాని ఫైల్స్ చిత్రంతో అమరావతి రైతుల త్యాగాన్ని, రాజధాని అవసరాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు దర్శకుడు భాను ప్రకాష్. ఆ చిత్రంతో బాగానే మెప్పించారు. ఇప్పుడు చంద్రబాబు బయోపిక్ తీయాలని నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా చంద్రబాబు రాజకీయ జీవితం అంటే చాలా రకాల పాత్రలు ఉంటాయి. దీంతో చంద్రబాబు పాత్ర ఎవరు పోషిస్తారు? మిగతా పాత్రధారులు ఎవరు? అనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది.సామాన్యుడిగా జీవితం ప్రారంభించి.. విద్యార్థి సంఘ నేతగా ఎదిగి.. రాజకీయాల్లోకి వచ్చి చంద్రబాబు( రాణించిన తీరు భిన్నంగా ఉంటుంది. ఆయన ప్రతి అడుగు సవాళ్లతో కూడుకున్నదే. అయితే చంద్రబాబును సినిమాలో ఎలా చూపిస్తారు అనేది ఇప్పుడు ఆసక్తి. చంద్రబాబు జీవితంలో జరిగిన ప్రతి ఘట్టంలో ఒక ఉద్వేగం, ఒక సంఘర్షణ దాగి ఉంది. దానిని బయోపిక్ లో చూపిస్తాను అంటున్నారు దర్శకుడు భాను ప్రకాష్.. అయితే ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, నిర్మాణ సంస్థ వివరాలు, షూటింగ్ విశేషాలు, ఇతర సమాచారం త్వరలో వెల్లడిస్తానని చెబుతున్నారు భాను ప్రకాష్. చంద్రబాబు పాత్రలో ఎవరు అనేది ఇప్పుడు ప్రశ్న. ఎన్టీఆర్ బయోపిక్ లో చంద్రబాబు పాత్రధారిగా దగ్గుబాటి రానా నటించారు. అయితే రామ్ గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన సినిమాల్లో చంద్రబాబు పాత్రధారి బాగా ఆకట్టుకున్నారు. ఆయన అయితే అచ్చం గుద్దినట్టు సరిపోతారు అనేది ఒక అంచనా. మరోవైపు ఇతర నేతలు, ముఖ్యుల పాత్రల కోసం ఎవరిని ఎంపిక చేస్తారు అనేది ప్రశ్న. చిన్న స్థాయి నుంచి ప్రారంభమైన చంద్రబాబు ప్రయాణం.. క్రమంగా రాజకీయాల్లో ఎదుగుతూ రాష్ట్ర నాయకుడిగా మారిన తీరు ఈ సినిమా ఇతివృత్తం. ఆయన తీసుకున్న నిర్ణయాలు, ఎదుర్కొన్న సవాళ్లు, ప్రజల కోసం చేసిన పనులు వంటి వాటిని ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఈ సినిమాలో కళ్ళకు కట్టినట్లు చూపిస్తారట. ముఖ్యమంత్రిగా సాధించిన మైలురాళ్లు, ప్రతిపక్ష నేతగా చేసిన యాత్రలు, నందమూరి కుటుంబంతో ఉన్న అనుబంధం, అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన దాడి, జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిన అరెస్టు.. ఇలా అన్ని ఎపిసోడ్లు ఉండనున్నాయని తెలుస్తోంది.

# వన్ మ్యాన్ ఆర్మీయేనా...



హైదరాబాద్ : తెలంగాణ అధికార పార్టీ కాంగ్రెస్లో వన్ మ్యాన్ 'ఆర్మీ'గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనిపిస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఆయన శ్రమించారు. ఇదే.. ఆయనకు ఎంతో మంది సీనియర్లను కూడా పక్కన పెట్టి.. ముఖ్యమంత్రి పీఠం దక్కేలా చేసిందన్న వాదన ఉంది. ఎన్నికల వరకు రేవంత్ దూకుడును అందరూ సమర్థించారు. బలమైన బీఆర్ ఎస్ పార్టీని నిలువరించేందుకు అందరూ.. అప్పట్లో సర్దుకు పోయారు.కానీ, పార్టీ అధికారం లోకి వచ్చిన తర్వాత కూడా సీఎంగా రేవంత్ రెడ్డి వన్ మ్యాన్ ఆర్మీగా వ్యవహరించడం.. తెలిసిందే. హైడ్రా వంటి కీలక వ్యవస్థను ఆయన తీసుకువచ్చారు. అదేసమయంలో ఆయన రైజింగ్ తెలంగాణ, ఫ్యూచర్ సిటీ వంటివాటిని కూడా తెరపైకి తెచ్చారు. 3 ట్రిలియన్ల ఆర్థిక శక్తిగా తెలంగాణను డెవలప్ చేస్తామని కూడా చెబుతున్నారు. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. అభివృద్ధి అనేది.. అందరూ స్వాగతిస్తారు. కానీ, క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంకు రాలాలంటే.. మాత్రం.. కలివిడి ముఖ్యం.నాయకులు ఎవరైనా.. కార్యకర్తలు ఎక్కడైనా కలివిడిగా ఉంటేనే.. పార్టీ పరంగా ముందుకు సాగేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయంలో రేవంత్ చర్యలు ఆశించినట్టుగా లేవన్నది పార్టీ వర్గాల్లో జరుగుతున్న చర్చ. ఒకప్పుడు రేవంత్ రెడ్డిని సమర్థించిన నాయకులు కూడా.. ఇప్పుడు తెరమరుగవుతున్నారు. తమ అభిప్రాయాలను చెబుతున్నారు. తాజాగా జీవన్ రెడ్డి పార్టీని వదిలి వెళ్లిపోయిన తర్వాత.. ఆన్ లైన్ ఛానెళ్లు కొందరు.. సీనియర్లను కలిసినప్పుడు.. రేవంత్ రెడ్డి వ్యవహారంపై వారు సూటిగా స్పందించారు."పార్టీ అంటే.. రేవంత్ ఒక్కరే అనుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు.. మండలస్థాయి నాయకులు కలివిడిగా ఉంటేనే.. నాడు అధికారంలోకి వచ్చాం. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడుందో చెప్పండి." అని సీనియర్ మోస్ట్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఇది ఈయన ఒక్కరి మాటే కాదు.. దాదాపు సీనియర్లుగా ఉన్న అందరి మాట కూడా ఇదే. ఒకవైపు.. బీఆర్ ఎస్ పుంజుకునేందుకు ప్రయత్నం చేస్తోందని.. కానీ.. కాంగ్రెస్లో ఒకే ఒక్క నాయకుడు అన్నట్టుగా రేవంత్ వ్యవహరిస్తున్నారని పెదవి విరుస్తున్నారు.అందరినీ కలుపుకొని పోవడంలోనూ.. అభిప్రాయ సేకరణలోనూ ఎలాంటి ప్రాధాన్యం లేకుండా పోయిందని ఆక్షేపిస్తున్నారు. "ఆయనకు నచ్చిన వారిని పదవులు ఇచ్చారు. ఇస్తున్నారు" అంటూ? కొందరు వేం నరేంద్రరెడ్డి వ్యవహారాన్ని తెరమీదికి తెస్తున్నారు. ఇలా.. చేయడం వల్ల.. వన్ మ్యాన్ ఆర్మీగా రేవంత్ను మెచ్చుకునేవారికి సంతోషమే అయినా.. క్షేత్రస్థాయిలో పార్టీ బలహీన పడిందని ఒకరిద్దరు చెప్పడం విశేషం.

# సింగరేణి బకాయిలను చెల్లించాలి

### - కార్పొరేట్ మెడికల్ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలి
### - సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ జాతీయ నేత మాధవ నాయక్

కొత్తగూడెం సింగరేణి : ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రు. 50వేల కోట్లను వెంటనే చెల్లించి సంస్థ మనుగడను కాపాడాలని బిఎంఎస్ అనుబంధ ఏబికెఎంఎస్ జాతీయ కార్యదర్శి పి మాధవ నాయక్ పేర్కొన్నారు. కొత్తగూడెం ఏరియాలోని పద్మావతి ఖని వద్ద సింగరేణి కోల్ మైండ్ స్టార్మిక సంఘ్ ఆధ్వర్యంలో నాగేశ్వరావు అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ నాయకులు, కార్మికులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాధవ నాయక్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలు అయిన టీఎస్- జన్ కో, టీఎస్ ట్రాన్స్కో కు నిరంతరం బొగ్గు, విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ, సంబంధిత సంస్థలు చెల్లింపులను చేయకపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని తెలిపారు. ప్రస్తుతం టీఎస్ జెన్కో వద్ద బొగ్గు సరాపర బకాయిలు సుమారు రూ. 20,000 కోట్లు, టీఎస్ ట్రాన్స్కో ( టీఎస్పీ సిసి) వద్ద విద్యుత్ సరఫరా బకాయిలు సుమారు రూ. 30,000 కోట్లు బకాయిలు పేరుకుపపోయి మొత్తం బకాయిలు రూ. 50,000 కోట్లకు పైగా చేరుకున్నాయని పేర్కొన్నారు. ఈ భారీ బకాయిల కారణంగా సింగరేణి పై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఉద్యోగుల జీతాలు, భద్రత పరికరాలు, పన్నులు, కాంట్రాక్ట్ ఖర్చులు, సరఫరాదారుల చెల్లింపులు, విస్తరణ కార్యక్రమాలకు అవసరమైన పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడుతోందని వివరించారు. కార్పొరేట్ మెడికల్ బోర్డు నిలుపుదలపై కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో యాజమాన్యం తక్షణమే కార్పొరేట్ మెడికల్ బోర్డును పునరుద్ధరించి సేవలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ గేట్ మీటింగ్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘం డిమాండ్లకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్. పవన్ కుమార్, లట్టి జగన్మోహన్, జి. వెంకటరెడ్డి, నాగేశ్వరరావు, మొగిలిపాక రవి, జి. గోపికృష్ణ, బి. రాజేష్, రంజిత్, ఆత్రేయ, ఎం. సుధాకర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.


## విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ,
పాఠకుల విశేష ప్రజాదరణ పొందుతూ
విజయవంతంగా రెండు తెలుగు రాష్ట్రాలలో నడపబడుతున్న
'ప్రజాకలం' తెలుగు దినపత్రికకు
జర్నలిజంపై ఆసక్తి, తెలుగు భాష పట్ల అవగాహన కలిగి
వ్రాయడం, చదవడంతో పాటు ప్రస్తుత సమాజం పట్ల బాధ్యత
కలిగిన విలేకరులు అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్చార్జ్లు, స్టాఫ్
రిపోర్టర్లు మండలాల వారిగా కావలెను.

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

తెలంగాణలో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను

సంప్రదించాల్సిన నంబరు:
+91 95535 39999

ఆంధ్రప్రదేశ్లో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను



# కార్మికుల ఐక్యత వల్లే సమ్మె విజయవంతం

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) ఆర్టీసీ సమ్మె విజయవంతమైన సందర్భంగా శనివారం జీడిమెట్ల డిపో ఎదురుగా ఆర్టీసీ కార్మికులు సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆర్టీసీ కార్మికులంతా ఒక్కటై జేఏసీగా ఏర్పడి సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేసినందుకే ప్రభుత్వం దిగివచ్చి ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కొరకు ఒప్పుకుందని అదే ఐక్యత రానున్న రోజుల్లో చూపెట్టాలని కార్మికులను కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను కనీసం చర్చలకు పిలవకపోగా మరింత క్రూరంగా వ్యవరించి అధికారులతో కార్మికులపైన అనేక ఒత్తిడిలను తీసుకొచ్చి కార్మికులను ఇబ్బందికి గురి చేసిందని, ఇప్పటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పైకి ప్రజా ప్రభుత్వమని చెబుతున్న కొన్ని చోట్ల నియంత్రిత్వాన్ని అవలంబిస్తుందన్నారు. ఆర్టీసీ కార్మికులు మరింత జాగ్రత్తతో ఉండి కొట్లాడి సాధించిన డిమాండ్ల అమలు కొరకు నిత్యం పోరాడాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసమే సిపిఐ, ఏఐటీయూసీ నాయకత్వం ఎల్లప్పుడూ పనిచేస్తుందని ఇక ముందు కార్మికుల నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో భాగస్వాములై ఆర్టీసీని మరింత బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఆర్టీసి జేఏసీ చైర్మన్ రాజు, అడ్వైజర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డానియల్, పాషా, జేఏసీ నాయకులు గోవర్ధన్, బాబు, గీత, ఖయ్యూం, రాజేష్,నరసింహారెడ్డిలతోపాటు పెద్ద ఎత్తున ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# చిట్టిబాబు సేవలో మరువలేనివి

## బండి సంజయ్ కుమార్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సినీ నటుడు సినీ విశ్లేషకుడు చిట్టిబాబు చేసిన సేవలు మరువలేనివని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



పేర్కొన్నారు. శనివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రగతినగర్లోని ప్రముఖ సినీ నిర్మాత, కళాకారుడు , రాజకీయ విశ్లేషకులు చిట్టిబాబు ఇటీవల పరమపదించిన సందర్భంగా ప్రగతినగర్ లోని వారి నివాసంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈసందర్భంగా వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ చిట్టి బాబుతో వారికున్న సాన్నిహిత్యాన్ని సేవలను గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు బిక్షపతి యాదవ్, ప్రసాద్ రాజు, సీనియర్ నాయకులు సుమన్ రావు, కళ్యాణ్ చక్రవర్తి, రవియాదవ్, శ్రీధర్ రెడ్డి, ఎన్ ఆర్ కె ముదిరాజ్, సురేష్, శరత్ చౌదరితో పాటు కార్యకర్తల నాయకులు పాల్గొన్నారు.

# రసాయన శాస్త్రంలో ఎం.కిషోర్ కు పీహెచ్.డీ.

పటాన్ చేరు ఏప్రిల్ 25 (ప్రజా కలం) ప్రతిని

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఎం. కిషోర్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'పెరోవ్ స్కైట్ సౌర సెల్స్ కోసం బెంజోళి1,2-ఎ:4,5-ఎ'రిడైథయోఫేన్ ఆధారిత నూతన రంధ్ర వాహక పదార్థాలు: సంశ్లేషణ, వర్గీకరణ, అనువర్తనాల'పై ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు ఈ



పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు పునరుత్పాదక శక్తి రంగంలో అభివృద్ధి చెందుతున్న, ఆశాజనకమైన సాంకేతికత అయిన పెరోవ్ స్కైట్ సోలార్ సెల్స్ కోసం అధునాతన రంధ్ర వాహక పదార్థాల (హెచ్ టీ ఎం ఎస్) రూపకల్పన, అభివృద్ధిపై ఈ పరిశోధన కేంద్రీకృతమైందని తెలియజేశారు నవీనమైన బెంజెళి1,2-ఎ:4,5-ఎఃరిడైథయోఫేన్ ఆధారిత సేంద్రియ పదార్థాలను సంశ్లేషించడం ద్వారా, సౌర సెల్స్ పనితీరులో సామర్థ్యం, స్థిరత్వానికి సంబంధించిన కీలక సవాళ్లను ఆయన పరిష్కరించారన్నారు కొత్తగా అభివృద్ధి చేసిన రంధ్ర వాహక పదార్థాలు అద్భుతమైన ఉష్ణ స్థిరత్వాన్ని సమర్థవంతమైన ఆవేశ రవాణాను, అనుకూలమైన శక్తి అమరికను ప్రదర్శిస్తాయని ఈ అధ్యయనం నిరూపించినట్టు పేర్కొన్నారు. ముఖ్యంగా, ఈ పదార్థాలను వినియోగించుకున్న డోపెంట్-రహిత పెరోవ్ స్కైట్ సౌర సెల్స్, మెరుగైన కార్యాచరణ స్థిరత్వంతో పాటు, 21.14 శాతం వరకు విద్యుత్ మార్పిడి సామర్థ్యాన్ని సాధించాయని తెలిపారు తక్కువ ఖర్చుతో కూడిన, అధిక పనితీరు గల సౌర సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో, సుస్థిర ఇంధన పరిష్కారాలకు దోహదపడటంలో, వినూత్న అణు రూపకల్పన యొక్క సామర్థ్యాన్ని ఈ పరిశోధన నొక్కి చెప్పిందన్నారు. డాక్టర్ కిషోర్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




## బుదేరా రెసిడెన్షియల్ స్కూల్ ను

# తెలంగాణలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా

## - మంత్రి దామోదర్ రాజనర్సింహ.



సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజా కలం):

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గం - మునిపల్లి మండలంలో బుదేరా లో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్ వార్షికోత్సవం లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎస్సీ ఎస్టీలను ప్రవేశపెట్టామన్నారు అందులో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో మూడు రెసిడెన్షియల్ స్కూల్స్ ను ప్రారంభించామన్నారు. తెలంగాణ ప్రాంతంలో మొట్టమొదటి రెసిడెన్షియల్ స్కూల్ ఆందోల్ నియోజకవర్గంలోని బుదేరాలో ప్రారంభించడం జరిగిందన్నారు. బుదేరా రెసిడెన్షియల్ స్కూల్ లో డిజిటల్ విద్యను అందిస్తున్నామన్నారు విద్యార్థుల కోసం ఆధునిక బెడ్స్ కిచెన్ వేర్స్ అందించమన్నారు విద్యార్థినులకు అవసరాల కోసం ఉజ్వల భవిష్యత్తు ,బలమైన పునాది కోసం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రెసిడెన్షియల్ స్కూల్లో క్రీడా సదుపాయాలు కల్పనకు, డిజిటల్ లైబ్రరీ, పుస్తకాలను సమకూర్చామని మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. బుదేరా రెసిడెన్షియల్ స్కూల్ భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో ఉత్తమ రెసిడెన్షియల్ స్కూల్ గా అభివృద్ధి చెందుతుందని మంత్రి ఆకాంక్షించారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో విద్యా , వైద్య రంగాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఆందోల్ నియోజకవర్గం విద్య, వైద్య రంగాల హబ్ గా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆధునిక మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. అనంతరం రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినిలతో ముఖాముఖిగా మాట్లాడారు. విద్యార్థినిలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు మెడల్స్, ప్రశంస పత్రాలను అందజేశారు.

# వేసవిలో దాహార్తి నివారణకు కె ఎస్ జియువసేన ముందడుగు

## కె ఎస్ జి యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు

## వాటర్ డిస్పెన్సర్లను ప్రారంభించిన కాట దంపతులు

పటాన్ చేరు ఏప్రిల్ 25 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్ చేరు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు కె ఎస్ జి యువసేన సభ్యులు ముందుకు రావడం అభినందనీయమని పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు



కె ఎస్ జి యువసేన సభ్యులు లక్ష్మణ్, శ్రీనివాస్ మరియు సురేష్ ఆధ్వర్యంలో అమీన్పూర్ మరియు బీరంగూడ డివిజన్లలో ఏర్పాటు చేయనున్న చలివేంద్రాల కోసం వాటర్ డిస్పెన్సర్లను కాట శ్రీనివాస్ గౌడ్ మరియు వారి సతీమణి కాట సుధా స్వయంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండలు మండిపోతున్న తరుణంలో బాటసారులకు మరియు సామాన్య ప్రజలకు చల్లని తాగునీరు అందించాలనే సంకల్పంతో యువత ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు లక్ష్మణ్, శ్రీనివాస్ మరియు సురేష్ లాంటి యువకులు సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించడం యువత అందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు ఇలాంటి సేవా కార్యక్రమాలకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని కాట శ్రీనివాస్ గౌడ్ హామీ ఇచ్చారు.

# సంగారెడ్డి నూతన కలెక్టర్ గా ప్రతిక్ జైన్.

## - కలెక్టర్ ప్రావీణ్య ను ఆర్ అండ్ & బి స్పెషల్ సెక్రటరీగా బదిలీ చేశారు.



సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజా కలం):

సంగారెడ్డి నూతన కలెక్టర్ గా ప్రతిక్ జైన్ నారాయణపేట జిల్లా నుంచి ఇక్కడికి వస్తున్నారు. శనివారం రాత్రి ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేసిన కలెక్టర్ ప్రావిణ్య ను ఆర్ అండ్ బి స్పెషల్ సెక్రటరీగా బదిలీ చేశారు.



ప్రజా కలం ప్రత్యేకం..

# విటమిన్ల గని @ తాటి ముంజలు



## - ప్రకృతి ప్రసాదించిన అద్భుతమైన వరం తాటి ముంజలు
## - వేసవిలో 'తాటి ముంజలకు భలే గిరాకీ'



కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 ప్రజా కలం :

వేసవి కాలం మొదలైందంటే చాలు.. భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ మంటలు పుట్టిస్తుంటాడు. గొంతు ఎండిపోతుంది, శరీరం నీరసించిపోతుంది. ఇలాంటి సమయంలో ఏ కూల్ డ్రింక్స్ తాగినా ఆ దాహం తీరదు, ఆ చలవ రాదు. కానీ, ప్రకృతి మనకు ప్రసాదించిన ఒక అద్భుతమైన వరం ఉంది. అదే 'తాటి ముంజలు'. ఒక్కసారి ఈ ముంజల రుచి చూస్తే, ఆ చలవను అనుభ విస్తే.. ఇక ఏ ఖరీదైన ఐస్ క్రీములూ దీని ముందు సరిపోవు! ఒకసారి వీటి వల్ల కలిగే లాభాలు, వీటి ప్రత్యేకతలు ఏమిటో చూద్దాం....

**బాడీకి నేచురల్ కూలెంట్ - ముంజల స్పెషాలిటీ!**

ఎండ దెబ్బ నుంచి బాడీని కాపాడుకోవడానికి తాటి ముంజెలు ఒక షీల్డ్ లా పనిచేస్తాయి. వీటిలో నీటి శాతం చాలా ఎక్కువ. డీహైడ్రేషన్ వల్ల శరీరం ఆవిరైపోతున్నప్పుడు, ఒక్క ముంజె తింటే చాలు.. తక్షణమే శక్తి వస్తుంది. శరీర ఉష్ణోగ్రతను అదుపులో ఉంచి, వడదెబ్బ తగలకుండా మిమ్మల్ని కాపాడే అసలైన బాడీగార్డ్ ఇవి.



**జీర్ణక్రియకు దివ్యౌషధం!**

పొట్టలో మంట, గ్యాస్, అసిడిటీ.. ఇలాంటి సమస్యలతో సతమత మయ్యే వారికి తాటి ముంజలు ఒక సంజీవని లాంటివి. ఇవి జీర్ణక్రియను వేగవంతం చేసి, మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తాయి. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు ఎదుర్కొనే వికారం, జీర్ణ సంబంధిత ఇబ్బందులకు ఇది ఒక గొప్ప నేచురల్ మెడిసిన్.

**తాటి ముంజలు పోషకాల పవర్!**

తాటి ముంజలు కేవలం చలవ కోసమే కాదు, వీటిలో ఆరోగ్యానికి కావాల్సిన అసలైన విటమిన్ల గని ఉంది. విటమిన్ ఎ, బి, సి లతో పాటు పొటాషియం, ఐరన్, కాల్షియం, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఎముకల బలానికి, మెటబాలిజం పెంచడానికి ఇవి తోడ్పడతాయి. ఇక బరువు తగ్గాలనుకునే వారు ఏ మాత్రం భయం లేకుండా వీటిని తినవచ్చు, ఎందుకంటే ఇందులో క్యాలరీలు చాలా తక్కువ.

**చర్మ సౌందర్యానికి కూడా ఇవి కేరాఫ్ అడ్రస్!**

ఎండల వల్ల వచ్చే చెమటకాయలు, చర్మంపై దద్దుర్లు, దురద వంటి సమస్యలకు ముంజలు ఒక మెజిక్ లా పనిచేస్తాయి. ముంజలలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని కాపాడటమే కాకుండా, చర్మంపై వచ్చే మంటను తగ్గించడానికి వీటి నీరు లేదా గుజ్జును రాస్తే తక్షణ ఉపశమనం లభిస్తుంది. చాలా మంది ముంజల పైన ఉండే సన్నని పొరను తీసేసి లోపల ఉన్న తెల్లని భాగాన్ని మాత్రమే తింటారు. కానీ అసలైన ఫైబర్ మరియు పోషకాలు ఆ పొరలోనే ఉంటాయి. అందుకే ఆ పొరతో సహా తినడం వల్ల పూర్తి ఆరోగ్య ప్రయోజనాలు అందుతాయి.

తాటి ముంజల ముందు కూల్డ్రింక్స్ పనికిరావు...

సహజ సిద్ధంగా లభించే తాటి ముంజల ముందు ఎంతటి ఖరీదైన కూల్డ్రింక్స్ కూడా అసలు పనికిరావు. ప్రజలు దీనిని దృష్టిలో ఉంచుకొని కృత్రిమ రంగులు, కెమికల్స్ ఉన్న కూల్ డ్రింక్స్ వెనుక పడవద్దని వైద్యులు సూచిస్తున్నారు. మన చుట్టుపక్కలే లభించే ఈ ప్రకృతి ప్రసాదాన్ని ఆస్వాదించండి. ఈ వేసవిలో తాటి ముంజలను మీ డైట్‌లో భాగం చేసుకోండి..రోగ నిరోధక శక్తిని పెంచుకోండి, సంపూర్ణ ఆరోగ్యంగా ఉండండి.



# షర్మిల దారిలో కల్వకుంట్ల కవిత

## -పార్టీ జెండా, వస్త్రాలు సేమ్ టూ సేమ్
## - మహిళా నాయకత్వం సాగుతుందా?

## భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్ర సేన విలీనం తప్పదా?

హైదరాబాద్: ఏప్రిల్ 25: ప్రజా కలం ప్రతినిధి

కవిత రాజకీయ పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో మహిళా నేతల ప్రస్థానం ఆసక్తికరమైన చర్చకు దారితీస్తోంది. ఒకరు వైఎస్సార్ తనయ షర్మిల అయితే, మరొకరు కేసీఆర్ గారాల పట్టి కవిత. వీరిద్దరి రాజకీయ ప్రయాణాల్లో ఎన్నో పోలికలు ఉన్నప్పటికీ, వారు ఎంచుకున్న గమ్యాలు మాత్రం వేర్వేరుగా కనిపిస్తున్నాయి. షర్మిల 2021లో వైఎస్సార్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీని స్థాపించి, రాజన్న రాజ్యం తెస్తానంటూ వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. అయితే, ఒంటరి పోరాటం తెలంగాణ గడ్డపై ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవడంతో, చివరకు రెండున్నర ఏళ్ల తర్వాత తన తండ్రి మాతృసంస్థ అయిన కాంగ్రెస్ పార్టీలోనే తన పార్టీని విలీనం చేశారు. రాజకీయ మనుగడ కోసం ఆమె విలీన బాట పట్టి, జాతీయ పార్టీ నీడలోకి చేరిపోయారు.





అదే సమయంలో, కల్వకుంట్ల కవిత ప్రయాణం తెలంగాణ రాజకీయాల్లో కొత్త మలుపు తిప్పుతుందని భావిస్తున్నారు. కవిత తన కొత్త పార్టీ తెలంగాణ రాష్ట్ర సేనగా (టీ ఆర్ ఎస్) ప్రకటన చేయడం గమనార్హం. ఇక్కడ విశేషమేమిటంటే, వీరిద్దరి పార్టీ జెండాల రంగులు, ప్రచార శైలిలో కొన్ని సారూప్యతలు కనిపిస్తున్నాయి. షర్మిల వాడిన పసుపు, ఆకుపచ్చ రంగుల కాంబినేషన్ తరహాలోనే కవిత పార్టీ జెండా ఉండటం చూస్తుంటే, ఒకే రకమైన రాజకీయ వ్యూహాన్ని అమలు చేస్తున్నారా? అన్న అనుమానాలు రాజకీయ విశ్లేషకుల్లో కలుగుతున్నాయి.

కానీ ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది. షర్మిల తన పార్టీని కాంగ్రెస్‌లో కలిపేసినట్లుగానే, కవిత కూడా భవిష్యత్తులో ఒడిదొడుకులు ఎదురైతే ఏదైనా పెద్ద పార్టీలో విలీనం చేస్తారా? లేక తన తండ్రి కేసీఆర్ ఉద్యమ కాలంలో చూపిన తెగువతో ఒంటరిగా పోరాడి నిలబడతారా? షర్మిల విలీనంతో ఒక సురక్షితమైన మార్గాన్ని ఎంచుకోగా, కవిత మాత్రం కుటుంబ రాజకీయాల నుండి బయటకు వచ్చి తనకంటూ ఒక సొంత అస్తిత్వాన్ని నిర్మించుకోవాలని చూస్తున్నారు. తన తండ్రి స్థాపించిన బిఆర్ఎస్ పార్టీ తన ప్రాభవాన్ని కోల్పోతున్న తరుణంలో, తెలంగాణ సెంటిమెంట్‌ను తిరిగి రగిలించి తెలంగాణ రాష్ట్ర సేన ద్వారా ఎదురునిలవడమే కవిత ముందున్న లక్ష్యం అంటున్నారు.

ఒకవైపు షర్మిల కాంగ్రెస్ నాయకురాలిగా తన ముద్ర వేయాలని చూస్తుంటే, మరోవైపు కవిత తన సొంత బలాన్ని నిరూపించుకోవాలని తాపత్రయపడుతున్నారు. షర్మిల మాదిరిగా మరో పార్టీలో చేరిపోకుండా, ఎన్ని కష్టాలు ఎదురైనా తన జెండాను రెపరెపలాడిస్తూ కవిత ఎదురు నిలుస్తుందా అన్నది ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్ గా మా రింది. పార్టీ ప్రకటన రోజు కవిత ధరించిన దుస్తులు రంగు, ఆనాడు షర్మిల ధరించిన దుస్తులు రంగు ఒక్కటే. చీర అంచు ఒకేలా ఉన్నాయి. షర్మిల రాజన్న పాలన తెలంగాణలో తీసుకొని వస్తాని ప్రతిమ పూని జోరుగా ప్రచారం చేసిన ప్రజల్లోకి వెళ్లారు. ఇక కవిత సైతం జాగృతి పేరు తో ప్రపంచంను చుట్టివచ్చింది.

తాజాగా రాజకీయ పార్టీ ఏర్పాటు చేసి ప్రజల మధ్యలో ఉంటాని, వెల్లడించారు. చివరికి షర్మిల తన పార్టీ ని కాంగ్రెస్ లో విలీనం చేసిన ఆంధ్రప్రదేశ్ చీఫ్ గా బాధ్యతలు చేపట్టింది. కవిత చేపట్టిన పార్టీ షర్మిల పార్టీ లా అవుతుందా? లేక రాష్ట్రా నికి సీఎం అయ్యేవరకు పోరాటం చేసి లక్ష్యం చేరుతుందా అన్నది కాలమే నిర్ణయించాలి.





## భక్తిశ్రద్ధలతో హనుమాన్ భిక్ష, భక్తి తో భజన

కంటోన్మెంట్: ఏప్రిల్ 25: ప్రజా కలం ప్రతినిధి

సీతాజయంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన రామకృష్ణ నివాసంలో హనుమాన్ భిక్ష కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జానకీ మాతకు ప్రత్యేక పూజలు చేసి, అనంతరం భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు.ఆంజనేయ స్వామికి అభిషేకం నిర్వహించి, హనుమాన్ మాలాధారుల తో కలిసి భజన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రామనామ స్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## సంగారెడ్డి కి మంజీరా నీటి కొరకు 200. కోట్లతో ప్రతి ప్రతిపాదనలు సిద్ధం చేయండి.

### - త్వరలో సంగారెడ్డికి ముఖ్యమంత్రి రానున్నారు.
### - మంజీరా నీటి సరఫరా పై మున్సిపల్, పబ్లిక్ హెల్త్, మిషన్ భగీరథ అధికారులతో జగ్గారెడ్డి, నిర్మల రివ్యూ సమావేశం.

సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 25( ప్రజా కలం):

సంగారెడ్డి కి తాను ఎమ్మెల్యే కాకముందు సంగారెడ్డిలో ఆరు ఫీట్ల లోతులో గుంతల్లో దిగి నీళ్లు పెట్టుకునేవారు అన్నారు. మాకు గుంతలు లేకుండా , గ్రౌండ్ పై మంజీరా నీళ్ళు రావాలని ఎన్నికల సమయం లో నన్ను కోరారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వైయస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు సంగారెడ్డిలో రూ. 230 కోట్లతో మంజీరా వాటర్ స్కీమ్



ఏర్పాటు చేయించాం అని అన్నారు. నాలుగు దిక్కులా పైపులైన్లు, ట్యాంకులు, నల్లాల కనెక్షన్లు నిర్మించడానికి నాలుగేళ్ల సమయం పెట్టిందన్నారు. ఆనాడు నల్లా కనెక్షన్ల కోసం 2 వేల నుండి 3 వేల రూపాయలు ఖర్చు అయ్యేది.. మున్సిపల్ లో ఒక రిజల్యూషన్ పెట్టి ఉచితంగా 18 వేల మంది కి మంజీరా నీళ్ళ కనెక్షన్ ఇచ్చి ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చూశాం. 2014 తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి మిషన్ భగీరథ తెచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి నేను ఎమ్మెల్యే గా లేకున్నా గత సంవత్సరం నుండి మళ్లీ దీనిపై రివ్యూ చేస్తున్నా అన్నారు. మంజీరా లో ఇప్పుడున్న ఇంటెక్ వెల్ స్థానంలో మరింత లోపలికి ఇంటెక్ వెల్ ఏర్పాటు చేయాలి.. అదనంగా టాంక్ ల నిర్మాణం చేయాలన్నారు. రోజూ రెండు గంటల పాటు మంజీరా నీరు రావాలిమ మరో యాభై ఏళ్ల కు సరిపడా నీటి సరఫరా కు ఇబ్బంది రావద్దని డిజైన్ చేస్తున్న ఓట్లకు, మంజీరా నీటికి సంబంధం లేదు. నేను ఊరొన్ని కాబట్టి చేస్తున్న అని అన్నారు. ప్రస్తుత ప్రాజెక్ట్ వ్యయం రూ. 175 కోట్లతో కొత్తగా ప్రతిపాదన, మంజీరా డ్యాం వద్ద అదనంగా రూ. 25 కోట్లతో మరొక ఇంటెక్ వెల్ కలిపి మొత్తం రూ. 200 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు

ఇప్పుడున్న 12 ట్యాంక్ లకు అదనంగా 8 ట్యాంకులు ఏర్పాటు చేయాలని రూ. 10 కోట్లతో కొత్త ఫిల్టర్ బెడ్ నిర్మాణం చేపట్టాలన్నారు.

ఇంటెక్ వెల్ కు అదనంగా రూ. 5 కోట్లు

రూ. 3.5 కోట్లతో తో 1800 కిలో లీటర్ల కెపాసిటీ తో సంపు నిర్మాణం చేపట్టాలన్నారు.

కొత్తగా. 50 కిలో మీటర్ల మేర డిస్ట్రిబ్యూషన్ పైపు లైన్ ఏర్పాటు

ఆదర్శ్ నగర్, మాస్టర్ మైండ్స్, శ్రీనగర్ కాలనీ, రాజీవ్ పార్క్ లో రెండు , రెవెన్యూ కాలనీ, సాయి నగర్, చింతపల్లి లో ట్యాంక్ ల నిర్మాణం

వచ్చే సోమవారం అత్యవసర కౌన్సిల్ సమావేశం లో పార్టీలకతీతంగా 38 మంది కౌన్సిలర్ ల అభిప్రాయం తీసుకోవాలన్నారు.

కాలనీ ల్లో తిరగండి, ప్రజల ను అడగండి, ఇంకేమైనా మిగిలిపోయాయా? తెలుసుకుని 5 వ తేదీ వరకు అదనంగా పైప్ లైన్ లు కావాలో వివరాలు సేకరించండని చెప్పారు.

స్థానిక ఎమ్మెల్యే, ఎంపి అభిప్రాయం కూడా తీసుకోండని తెలిపారు.

ఎక్కడెక్కడ పైప్ లైన్ కావాలో మున్సిపల్ లో దరఖాస్తు చేసుకోవాలని మూడు రోజుల పాటు ఆటోలో తిరిగి చాటింపు వేయండని సూచించారు.

సంగారెడ్డి టౌన్ లో ఎక్కడ కూడా నల్లా నీటి గుంతలు ఉండకూడదు అని అధికారులకు సూచన ఈ పదేళ్ల లో జరిగిన నష్టాన్ని పూర్తి చేయాలని సంగారెడ్డి ప్రజల కోసం రూ. 200 కోట్లతో డిజైన్ చేస్తున్న మంజూరు, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుని, 2027 లో పనులు ప్రారంభించి 2028 వరకు పనులు పూర్తయితే తిరిగి సీఎం రేవంత్ రెడ్డి తో ప్రారంభించుకోవాలి అనేది నా ప్రణాళిక ఎక్కడైతే సంగారెడ్డి టౌన్ లో మిషన్ భగీరథ పైప్ లైన్ కలిపారో అది కట్ చేసి కొత్తగా నిర్మించే మంజీరా వాటర్ పైప్ లైన్ కు కల్పించాలన్నారు.

... ఉమ్మడి రాష్ట్రం లో రెండు గంటల పాటు పుష్కలంగా మంజీరా నీరు వచ్చేదన్నారు.

..పదేళ్ల క్రితం ఫస్ట్ ఫ్లోర్ కు సైతం మంజీరా నీళ్ళు వచ్చేవి అన్నారు.

... ఈ పదేళ్ల లో మొత్తం మంజీరా వాటర్ స్కీమ్ ను నాశనం చేశారు

... మిషన్ భగీరథ తీసుకువచ్చి సంగారెడ్డి మంజీరా వాటర్ స్కీమ్ ను పూర్తిగా భ్రష్టు పట్టించారు.

సీఎం సంగారెడ్డి కి త్వరలో వస్తున్న నేపథ్యం లో వచ్చే నెల 5 వ తేదీ వరకు పూర్తి స్థాయి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు జగ్గారెడ్డి సూచించారు

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com